


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 13-10-2019 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 29 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# కొత్త అధ్యాయం



## విభేదాలు పెరగకుండాం చూసుకుంటాం

## శాంతి, స్థిరత్వం కోసం సహకారమందిద్దాం

## కశ్మీర్ భారత అంతర్గత విషయం

## భారత్, చైనా అగ్రనేతల ముగిసిన శిఖరాగ్ర భేటీ

చెన్నై: భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీ నేపథ్యంలో కశ్మీర్ అంశంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. మోదీ-జిన్‌పింగ్ అనధికార శిఖరాగ్ర భేటీలో కశ్మీర్ అంశం ప్రస్తావనకు రాలేదని భారత విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే స్పష్టం చేశారు. కశ్మీర్ భారత అంతర్గత విషయమన్న మన వైఖరికి అందరికీ సుస్పష్టంగా తెలిసిందేనని ఆయన అభిప్రాయపడ్డారు. అధికార లాంఛనాలకు లేకుండా రెండు రోజుల పాటు జరిగిన మోదీ-జిన్‌పింగ్ సమావేశాలు ముగిశాయి. ఈ నేపథ్యంలో విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే శనివారం మీడియాతో మాట్లాడారు. మొదట ఇద్దరు నేతలు 90 నిమిషాలపాటు తరువాయి 2లో..

### విభేదాలు పెరగకుండా చూసుకుంటాం: మోదీ

చెన్నై కనెక్ట్ భేటీతో భారత్-చైనా బంధంలో కొత్త అధ్యాయం మొదలైంది. వూహాన్‌లో జరిగిన తొలి భేటీనే ఇందుకు స్ఫూర్తి. చైనా, తమిళనాడు మధ్య బలమైన వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలున్నాయి. ఆర్థికంగా మన రెండు దేశాలు శక్తిమంతమైనవి. ఇరు దేశాల మధ్య విభేదాలు పెరగకుండా తరువాయి 2లో..

### మీ ఆతిథ్యంతో మైమరచిపోయాం : జిన్‌పింగ్

ఈ పర్యటన నేను ఎప్పటికీ మరువలేను. మీ ఆతిథ్యం మమ్మల్ని మైమరచిపోయేలా చేసింది. నాకు, నా సిబ్బందికి ఈ పర్యటన ఓ మధుర జ్ఞాపకంలా మిగిలిపోతుంది. మోదీజీ మీరన్నట్లుగానే మన మధ్య 'స్నేహపూర్వక చర్చలు జరిగాయి' అని జిన్‌పింగ్ కొనియాడారు. ఈ చర్చల అనంతరం కోవలం రిసార్ట్‌లో తరువాయి 2లో..

### మాటల వ్యక్తి కాదు.. చేతల వ్యక్తి.. బీచ్‌లో చెత్త ఎత్తిన మోదీ



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తాను మాటలు మాత్రమే చెప్పే వ్యక్తిని కాదని నిరూపించుకున్నారు. ఎప్పుడు స్వచ్ఛత జపం చేసే ప్రధాని స్వయంగా శ్రామికుడిలా మారి చెత్తను ఎత్తారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో తెగ వైరలవుతోంది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్ర మోదీల మధ్య అనధికార భేటీ శుక్రవారం మహాబలిపురంలో ప్రారంభమైన సంగతి తరువాయి 2లో..

# 15న వైఎస్సార్ రైతు భరోసా ప్రారంభం

- కౌలు రైతులకు కూడా సహాయం
- ఏడాదికి రూ. 12,500 సహాయం
- సమీక్షించిన మంత్రి అనిల్‌కుమార్ యాదవ్



అమరావతి: ఈ నెల 15వ తేదీన పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా పథకం ప్రారంభం కాబోతున్నది. నెల్లూరు నగర సమీపంలోని కాకుటూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభిస్తారు. తొలుత ఆయన ఆరోజు ఉదయం 10.30 గంటలకు విక్రమసింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణం చేరుకుంటారు. ఆ తరువాత కౌలు రైతులకు కార్డుల పంపిణీ అనంతరం రైతులకు వైఎస్సార్ రైతుభరోసా చెక్కులను పంపిణీ చేసి అనంతరం జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా నెల్లూరు జిల్లాలో పర్యటించనున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు వైస్సార్‌సీపీ నేతలు, అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

### రైతు సంక్షేమానికి కోట్లు ఖర్చైనా వెనుకాడేదిలేదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా హామీ ఇచ్చిన రైతు భరోసా పథకం అమలుకు తగిన కసరత్తును పూర్తి చేశామని వ్యవసాయ శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ శనివారం వెల్లడించారు. వెబ్‌ల్యాండ్ రికార్డు ఆధారంగా గుర్తించిన లబ్ధిదారుల జాబితాను అన్ని గ్రామ పంచాయితీల్లో పొందుపరిచామని ఆయన పేర్కొన్నారు. అర్హులైన రైతులకు ఏడాదికి రూ. 12500 సహాయం అందించే ఈ పథకం లబ్ధిదారుల తొలి జాబితాను ఆదివారం సాయంత్రం ఖరారు చేస్తామని తెలిపారు. అక్టోబరు 15వ తేదీన ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సహాయం అందిస్తామని, 15 తర్వాత కూడా సమస్యలున్న రైతులకు వాటి పరిష్కారం కోసం తగిన సమయం ఇవ్వాలను కుంటున్నట్టు అరుణ్‌కుమార్ తెలియజేశారు. కౌలు రైతులకు కూడా పెట్టుబడి తరువాయి 2లో..

## వరల్డ్ బాక్సింగ్‌లో మేరీకోమ్‌కు కాంస్యం

వార్త 8వ పేజీలో..

# సంస్థాగత ఎన్నికల్లో వైకాపా విజయం ఖాయం

- అభివృద్ధి చూసి బాబు ఓర్వలేకపోతున్నారు..
- పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్



విశాఖపట్నం: విశాఖ పశ్చిమ నియోజక వర్గపర్యటనలో భాగంగా పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. పశ్చిమ నియోజకవర్గం ఐటీఐ జంక్షన్ వద్ద రూ. 60 లక్షల వ్యయముతో డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణం, స్మశాన వాటికలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. రానున్న సంస్థాగత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని.. భారీ మెజార్టీ సాధించి ముఖ్యమంత్రికి బహుమతిగా ఇస్తామని పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. రానున్న ఐదేళ్లలో 25 లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వెల్లడించారు. దివంగత మహానేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో 25 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. అవినీతికి తావులేకుండా లక్షన్నర ఉద్యోగాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

### చంద్రబాబు ఓర్వలేకపోతున్నారు..

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన చేస్తున్నారని వెల్లడించారు. తరువాయి 2లో..

# ఇసుక కొరత లేకుండా చూడండి

- రాష్ట్రంలో రోజుకు 35వేల టన్నుల ఇసుక సరఫరా
- వరద పరిస్థితులే ఇసుక ఇబ్బందులకు కారణం
- పట్టాదారు భూముల్లోని ఇసుకపై దృష్టి సారించాలి
- గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి రామచంద్రారెడ్డి



అమరావతి : రాష్ట్రంలో ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్లు, మైనింగ్ అధికారులతో నూతన ఇసుక పాలసీపై శనివారం సచివాలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వర్క్ షాప్ నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ఇసుక వల్ల ఇబ్బందులు లేకుండా చూడాలని తరువాయి 2లో..




# సచివాలయ వ్యవస్థతో సువర్ణాధ్యాయం



## మంత్రి బొత్స సత్యనారాయణ

అమరావతి : గ్రామ సచివాలయ వ్యవస్థ, కంటి వెలుగు పథకాలను తామే ముందు తీసుకొచ్చామని అబద్ధాలు చెబుతున్న ప్రతిపక్ష నేత చంద్రబాబుకు కంటిచూపు మందగించినట్లుందని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. అమరావతిలో నిర్మించిన తాత్కాలిక సచివాలయాన్ని చూసి సచివాలయ వ్యవస్థను తానే తీసుకొచ్చానని చంద్రబాబు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ సచివాలయం వేరు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ వేరు అన్న విషయం బాబు తెలుసుకోవాలని హితవు పలికారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి బొత్స మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రజారంజక పాలన చూసి చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.

### బాబు పాలనలో వందల ఎకరాలు దోచుకున్నారు

గ్రామ సచివాలయ వ్యవస్థను చంద్రబాబు తెచ్చారనడం సరికాదు. గాంధీజీ స్ఫూర్తితో ప్రభుత్వ పథకాలను ప్రజల గుమ్మం ముందుకు తెవాలని సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసిన బాబు ఇప్పుడు మొసలి కన్నీరు తరువాయి 2లో..

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన రాంబాబు



దేవరాపల్లి : డా.బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ పిలోషిప్ అవార్డు (ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు) మండలంలోని నాగయ్య పేట గ్రామానికి చెందిన కొట్టాన రాంబాబు మాష్టర్ కి దక్కింది. రాష్ట్ర బౌద్ధ పరిషత్ (ట్రస్ట్) అమలాపురం వారు ప్రతి సంవత్సరం బహూకరించే డా.అంబేద్కర్ నేషనల్ పిలోషిప్ అవార్డు పురస్కారాన్ని 2018-19కు గాను ఎంపియూపీ స్కూల్, నాగయ్యపేటలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న గురుబ్రహ్మ అవార్డు గ్రహీత రాంబాబు మాష్టర్ కు ప్రకటించారు. ఈ పురస్కారాన్ని అంబేద్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించిన రోజేనా అక్టోబర్ 14న సోమవారం రావులపాలెంలో రాష్ట్ర బౌద్ధిస్ట్ ట్రస్ట్ చైర్మన్ గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో ప్రదానం చేయడం జరుగుతుందని అవార్డు గ్రహీత కె. రాంబాబు తెలిపారు.

## మన కుటుంబం ఛారిటబుల్ ట్రస్టు

## *బాలల సంరక్షణ కేంద్రం పిల్లలకు దుస్తులు పంపిణీ*

భీమునిపట్నం: మాజి మంత్రి గంటా శ్రీనివాసరావు సతీమణి శారదమ్మ పుట్టినరోజు సందర్భంగా శనివారం మన కుటుంబం ఛారిటబుల్ ట్రస్టు బాలల సంరక్షణ కేంద్రం పిల్లలకు మూడు పూటలు భోజనము ఏర్పాటు చేసారు.అలాగే పిల్లలకు దుస్తులు అందజేశారు. అంతేకాకుండా రోడ్డు ప్రక్కన గుడారాలలో నివసిస్తున్న పిల్లలు మధ్య కేక్ కటింగ్ చేసి వారి ఆశీస్సులు పొందారు. వీరికి వుయ్ కేర్ యు మరియు హెల్పింగ్ హేండ్స్ తరుపున ఇన్ చార్జ్ వేంపాడ శ్రీనివాసరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

# ముంపుకు గురైన వరి పొలాలు

దేవరాపల్లి : రోజుకు కురుస్తున్న వర్షాలకు గెడ్డలు వాగులు వంకలు పొంగిపొరలి పారుతున్న వర్షపు నీటికి వరి పొలాలు మండలంలోని కాశిపురం చిన్న నందిపల్లి అలమండ సీతమ్మ పేట నాగయ్య పేట ఇలా పలు గ్రామాలలో వర్షపు నీరుకు ఏరులై పారుతున్న నీటిలో వరి పొలాలు నీట మునిగాయి.

# నాగేంద్ర పాలెంలో మిగిలిన భూమికై సర్వే



గొలుగొండ : మండలంలో గల నాగేంద్ర పాలెం రెవిన్యూ లో 19 ఎకరాల నలభై సెంట్లు ఉండవలసిన భూమి కి, 17 ఎకరాల 15 సెంట్లు మాత్రమే రైతులు ఉన్న ట్టుగా నమోదు ఉన్నది. మిగిలిన భూమి ఎక్కడ ఉన్నా చూసి ఉన్నట్లు గుర్తించడం కోసం తాసిల్దార్ వెంకటేశ్వరరావు ఆయన సిబ్బంది సర్వేరు మరియు విఆర్ఓ వాళ్ళందరూ కలిసి కలిసి సర్వే చేయడం జరిగిందని ఆయన తెలిపారు. విలేకరులకు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించడం కోసం డ్రైవ్ చేస్తున్నట్లు తహాశీల్ధార్ పేర్కొన్నారు.

# ముంపు గ్రామాలను కాపాడాలని ప్రజలు ఆందోళన



గొలుగొండ : తాండవ నది రిజర్వాయర్ చుట్టు పక్కల ఉన్న గ్రామం సాలిక మల్లవరం, వెంకటాపురం ,పంట్ల పాలెం, అమ్మపేట గ్రామాలకు ముప్పు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. రాత్రిపూట లోనూ, పగలు కూడా పాముల బెడద ఎక్కువగా ఉందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పైన తెలిపిన గ్రామాలకు సుమారుగా గ్రామానికి 15 మీటర్ల దూరంలో తాండవ పలువురు ఆందోళన చెందుతున్నారు. ఏం చేయాలో తోచని పరిస్థితిలో ఉన్నారని దీనిపై ప్రభుత్వం ఏవయినా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంలో పలువురు ఆందోళన చెందుతున్నారు.



శ్రీశ్రీశ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు లో భాగంగా 16వవార్డులో చిన పొలమాంబ గుడి వద్ద బొబ్బిలి రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపాన్ని వైకాపా నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ దర్శించు కున్నారు. కార్యక్రమంలో అమ్మవారి పూజా అనం తరం తీర్ధ ప్రసాధములు స్వీకరించారు. వాడ వాడాల అమ్మవారి పూజలు ఘనంగా ఏర్పాటు చేయడం అందరి జీవితాల్లో మంచిని, స్నేహ భావం కలుగుతుందని అన్నారు. వినాయక యూత్ స్పెషల్ స్టార్స్‌ని అభినందించారు. గ్రామ పెద్దలు, వార్డు అధ్యక్షుడు గోవింద్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హాస్టల్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలి

## ఎఐటియుసి డిమాండ్

అనకాపల్లి : జిల్లా వ్యాప్తంగా హాస్టల్స్ లో పని చేస్తున్న కార్మికులు సమస్యలు పరిష్కరిం చాలని వారి పై ప్రభుత్వం చిన్న చూపు తగదని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పడాల రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోన. లక్ష్మణ ఒక్క ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలలో కాంట్రాక్టు ఔటుసోర్సింగ్ కార్మికులు జీవితాలల్లో మార్పు తీసుకొస్తానని, రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన వైస్సార్సీపీ అధినేత జగన్ అధికారంలోకి వచ్చి4నెలలు గడిచిన ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు, సంక్షేమ హాస్టల్స్ వాచ్ మెన్, వంట మనిషి, కమాటి వంటి ఉద్యోగాలు నిర్వహిస్తున్న కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారని వారు తెలిపారు కాంట్రాక్టు కార్మికులు సమాన పనికి సమాన వేతనం అములుకు సంబంధించి చర్యలు తీసుకోవడం లో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం గా మెండిగా వ్యవహరిస్తున్నది వారు విమర్శించారు కార్మికులు కార్మిక చట్టాలు అములు చేయాలని అలాగే రాష్ట్ర ప్రభుత్వం కార్మికులును పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిహాస్టల్ 100మంది విద్యార్థులు 3కార్మికులు ను ఖచ్చితంగా అములు చేయాలని, పతి నెల5 తేదీ లోగావేతనాలు చెల్లించాలని ,8గంటలు పని విధానం అములు చేసి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అములు చేయాలని లేకుంటే రానున్న రోజుల్లో జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు

# గబ్బాడ స్కూలు విద్యార్థులు

నర్సీపట్నం : రాష్ట్రస్థాయిలో షాఫ్ట్ బాలు పోటీలుకి గబ్బాఢ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శరగడం ఆనందరావు తెలిపారు. విద్యార్థులు కె. ప్రకాష్, ఢిల్లీ బాబు జిల్లాలోని గోవాడలో జరిగిన జిల్లాస్థాయి సాఫ్ట్బాల్ ఫోటోలులో ప్రధమ స్థాయి విజేతలుగా నిలిచారు. వీరు రాష్ట్ర స్థాయిలో అర్హత సాధిం చడానికి కారకులైన, శిక్షణలో పెంపొందించిన, పాఠశాల పి.ఇ.టి నాగేశ్వరరావును, విద్యా ర్థులను పాఠశాల సిబ్బంది ప్రధానోపాధ్యాయులు అభినందించారు.



అర్హత సాధించిన ప్రకాశ్, డిల్లీబాబు

## సత్యదేవుడ్ని దర్శించిన

# మున్సిపల్ కమిషనర్ అభిషిక్త్ కిషోర్



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్య నారాయణ స్వామివార్ని రాజమండ్రి మున్సిపల్ కమీషనర్ అభిషిక్త్ కిషోర్ శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జై భాస్కర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ఆర్ వాహనమిత్రతో ఆటోడ్రైవర్లకు చేయూత

## ప్రభుత్వ విప్ మాడుగుల నియోజకవర్గం ఎమ్మెల్యే బూడి

దేవరాపల్లి : నాడు పాదయాత్రలో నేను విన్నాను నేను ఉన్నాను అన్న మాటకు నిదర్శనంగా ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే ఆటోడ్రైవర్లకు వైయస్సార్ వాహన మిత్ర పేరుతో పదివేల రూపాయలు ఆటో డ్రైవర్లకు ఖాతాలో జమ చేసి ఘనత వైయస్సార్ పార్టీ దే అని ప్రభుత్వ విప్ మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు అన్నారు.పార్టీ ఏర్పడిన అతి కొద్ది కాలంలోనే మన ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరి మన్ననలు పొందుతున్నారు అని అన్నారు. మండలంలోని శనివారం పేదనందిపల్లి సంపత్ వినాయక ఆటో యూని యన్ ఆధ్వర్యంలో సత్యనారాయణమూర్తి కాలనీ నుంచి పేదనందిపల్లి జంక్షన్ వరకు ఎమ్మెల్యే ఆటో నడుపుతూ ర్యాలీగా బయలుదేరి అనంతరం వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆటో యూనియన్ సభ్యులు మాట్లాడుతూ మా జంక్షన్ వద్ద ప్రయాణికులకు నిలువనీడ లేదని ఎమ్మెల్యే గ చొరవ చూపి మా జంక్షన్ లో బస్టాండ్ నిర్మించాలని వారు కోరారు. త్వరలోనే అందుకు సన్నాహాలను చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు కర్రి సత్యం, మండల యువజన విభాగం అధ్యక్షులు బూరె బాబురావు, పేద



నందిపల్లి వైయస్సార్ సీపీ నాయకులు రంగోలి నారాయణమ్మ, గేదెల వెంకట్రావు, ఆటో యూనియన్ సభ్యులు ఇంజన్‌రపు ఈశ్వరరావు, బత్తిన అప్పలనాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# కొత్త అధ్యాయం

చర్చించుకున్నారు. ఆ తర్వాత ప్రతినిధులస్థాయి చర్చలు జరిగాయి. అనంతరం మోదీ ఇచ్చిన మధ్యాహ్న విందును జిన్‌పింగ్ స్వీకరించారు. ఈ సదస్సులో భాగంగా మొత్తం ఆరు గంటల పాటు ఇరునేతలు ముఖాముఖి భేటీ అయ్యారు. భారత్, చైనా మధ్య పరస్పర సహకారం, పర్యాటకం, వాణిజ్యం తదితర అంశాలపై అత్యున్నత స్థాయిలో చర్చించేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, చైనా ఉపాధ్యక్షుడు హు చున్‌హువా దీనిపై చర్చించనున్నారు అని ఆయన తెలిపారు. ప్రధాని మోదీని జిన్‌పింగ్ చైనాకు ఆహ్వానించారని, మోదీ కూడా అంగీకరించారని, త్వరలోనే ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఖరారు చేస్తామని విజయ్ గోఖలే వెల్లడించారు.

## *విభేదాలు పెరగకుండా చూసుకుంటాం: మోదీ*

చూసుకుంటామని హామీ ఇస్తున్నాం. మన సంబంధాలు, సమస్యలపై సున్నితంగా ఉందాం. ప్రపంచంలో శాంతి, స్థిరత్వం కోసం మనవంతు సహకారం అందిద్దాం' అని మోదీ చెప్పుకొచ్చారు.



*మీ ఆతిథ్యంతో మైమరచిపోయాం: జిన్‌పింగ్*

ఏర్పాటు చేసిన చేనేత వస్తువులు, కళాఖండాల ప్రదర్శనను మోదీ, జిన్‌పింగ్ సందర్శించారు. విందు భేటీలో మరోసారి చర్చలు జరిపిన అనంతరం జిన్పింగ్ తిరుగు పయనమవనున్నారు.

## మాటల వ్యక్తి కాదు.. చేతల వ్యక్తి.. బీచ్‌లో చెత్త ఎత్తిన మోదీ

తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండో రోజు భేటీ ప్రారంభానికి ముందు మోదీ దేశ ప్రజలకు క్లీన్ అండ్ ఫిట్ సందేశాన్ని ఇచ్చారు. శనివారం ఉదయం మోదీ మహాబలిపురం బీచ్‌లో జాగింగ్ చేయడానికి వెళ్లారు. ఆ సమయంలో ఓ సాధారణ వ్యక్తిలా సముద్రం తీరంలో అరగంటపాటు తిరిగిన మోదీ... అక్కడున్న చెత్తను స్వయంగా ఆయనే శుభ్రం చేశారు. బీచ్‌లో పడిఉన్న ప్లాస్టిక్ కవర్లను, బాటిళ్లను ఆయన చెత్తో క్లీన్ చేశారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు.

ఇందుకు సంబంధించిన ఫొటోలను, వీడియోలను ట్విటర్‌లో పోస్ట్ చేస్తూ.. మహాబలిపురం బీచ్‌లో అరగంట పాటు తిరిగాను. అక్కడ నేను సేకరించిన నా కలెక్షన్‌ను హోటల్ సిబ్బందిలో భాగమైన జయరాజ్‌కు అప్పగించాను. మన బహిరంగ ప్రదేశాలు శుభ్రంగా మరియు చక్కగా ఉండేలా చూద్దాం. మనం ఆరోగ్యంగా ఉండేలా చూసుకుందాం అంటూ మోదీ ట్వీట్ చేశారు. ప్రధాని ట్వీట్‌కు లక్షల్లో లైకులు వస్తున్నాయి. మీరు గ్రేట్ సార్.. కేవలం మాటలకే పరిమితం కాదు.. చేతల్లో చూపిస్తారు అంటూ.. నెటిజన్లు ఆయనను ప్రశంసంలతో ముంచెత్తుతున్నారు.

## 15న వైఎస్సార్ రైతు భరోసా ప్రారంభం

సహాయం అందించే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. రైతుల సంక్షేమం కోసం ఎన్ని వేల కోట్లు ఖర్చయినా వెనుకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు కమిషనర్ తెలిపారు.

## సంస్థాగత ఎన్నికల్లో వైకాపా విజయం ఖాయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి.. చంద్రబాబు ఓర్వ లేకపోతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నో అక్రమాలు జరిగాయని.. అవినీతిని రూపుమాపడానికి ప్రజలంతా ప్రభుత్వంతో సహకరించాలని కోరారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధనకు.. వైఎస్ జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారని.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఎన్నో గొప్ప పథకాలు రూపొందించారని పేర్కొన్నారు. ఏ సమాజం అయినా విద్యతోనే అభివృద్ధి చెందుతుందని.. విద్యలో ఏపీ దేశంలోనే ప్రథమస్థానంలో నిలవాలన్నదే సీఎం జగన్ సంకల్పమని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు పేదలకు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాలుగు లక్షల మందికి రైతు భరోసా అందిస్తున్నామని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ఒక బైబిల్, ఖురాన్, భగవద్గీతలా భావిస్తున్నామని మంత్రి అవంతి అన్నారు.

## ఇసుక కొరత లేకుండా చూడండి

సూచించారు. ప్రస్తుతం రోజుకు 35వేల టన్నుల ఇసుక సరఫరా జరుగుతోందని, దీనిని రోజుకు లక్ష టన్నులకు పెంచాలని పేర్కొన్నారు. గత మూడు నెలలుగా వరద పరిస్థితి కొనసాగుతుండటం వల్ల ఇసుక తవ్వకాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని, వరదలు తగ్గే వరకు ప్రత్యామ్నాయంగా పట్టాదారు భూముల్లోని ఇసుకపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే ఇసుక తవ్వకాల కోసం జిల్లాల నుంచి పట్టాదారులు దరఖాస్తులు సమర్పిస్తున్నారని, తక్షణం ఈ దరఖాస్తులను ఆమోదించి.. ఇసుక తవ్వకాలు ప్రారంభించాలని మంత్రి పెద్దిరెడ్డి ఆదేశించారు. అదేవిధంగా ఇసుక సరఫరాపై జాయింట్ కలెక్టర్‌లకు బాధ్యతలు అప్పగించామని తెలిపారు. అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. రీచ్‌లకు అనుగుణంగా ఇసుక స్టాక్ పాయింట్‌లను గుర్తించాలని, ఓపెన్ రీచ్‌లో వరద పరిస్థితి కారణంగా ఇసుక తవ్వకాలు చేయలేకపోతున్నామని అన్నారు. గత మూడు నెలలుగా కృష్ణానదిలో వరద పరిస్థితి కొనసాగుతోందని, జలాశయాల్లో, స్థానిక జలవనరుల్లో మేటవేసిన ఇసుక నిల్వలను గుర్తించాలని, వీటిని బయటకు తీయడం వల్ల జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుండటంతోపాటు ఇసుక సరఫరా మెరుగవుతుందని మంత్రి తెలిపారు.

మెదటి, రెండు, మూడు గ్రేడ్ లలోని రీచ్‌లలో ట్రాక్టర్లకు అనుమతి ఇస్తామని, గ్రామ సచివాలయాల సిబ్బందిని రీచ్‌లవద్ద పెట్టి ఆన్‌లైన్ ప్రక్రియను మరింత సరళతరం చేయాలని పెద్దిరెడ్డి అధికారులకు సూచించారు. మైనింగ్ అధికారులు జిల్లా జాయింట్ కలెక్టర్ లతో సమన్వయం చేసుకోవాలని, ఇసుక లభ్యత వున్న జిల్లాల్లో స్థానికుల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకున్న సంబంధిత జిల్లా వాసులకు కొంత వరకు ఇసుకను రిజర్వు చేయాలని, ఇసుక అవసరాల కోసం ఆన్‌లైన్ లో వస్తున్న దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## సచివాలయ వ్యవస్థతో సువర్ణాధ్యాయం

కారుస్తున్నారు. విశాఖలో భూ కుంభకోణం జరిగిందని టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు గతంలో ఫిర్యాదు చేశారు. గత ఐదేళ్లు విశాఖపట్నంలో వందల ఎకరాల భూములను చంద్రబాబు, ఆయన కోటరీ దోచుకుతిన్నారు అని బొత్స సత్యనారాయణ నిప్పులు చెరిగారు.

ఖబడ్దార్ అంటూ బాబు బెదిరిస్తున్నారు

చంద్రబాబు నోటికి ఏదొస్తే అది స్థాయి మరిచిపోయి మాట్లాడుతున్నారు. ఏమైనా అంటే ఖబడ్దార్ అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. నెల్లూరు జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేపై అభియోగం వస్తే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. చంద్రబాబు పాలనలో నిందితులను చంద్రబాబు ఇంటికి పిలిచి సెటిల్‌మెంట్లు చేశారు. రూ.2.50 లక్షల కోట్ల అప్పు కాకుండా ఎంబుక్కులు రికార్డు చేయకుండా చంద్రబాబు రూ.50 వేల కోట్ల అప్పు చేసింది వాస్తవం కాదా? రాజధానిపై నిపుణుల కమిటీ వేశాం. కమిటీ సిఫార్సులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది అని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

# వై.యస్.ఆర్, కంటి వెలుగు ద్వారా విద్యార్థులకు పరీక్షలు

## పిహెచ్.సి, వైధ్యాధికారిణి డా. దమయంతి



చోడవరంః మండలంలోని 79 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 10, 900 మంది విద్యార్థినీ, విద్యార్థులకు డాక్టర్ వై.యస్.ఆర్, కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కంటి పరీక్షలు చేయనున్నారని గవరవరం ప్రాధమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ దమయంతి అన్నారు. మండలంలోని లక్కవరం, శేమునాపల్లి, ముద్దుర్తి, అంకుపాలెం,గజపతినగరం, భోగాపురం గ్రామాలలోని ప్రభుత్వ ప్రాధమిక పాఠశాలల్లో ప్రత్యేక కంటి వైద్య శిభిరాలను శనివారం నిర్వహించారు.

మొదటి దశగా ఈ నెల 10 నుంచి 16 వరకు అన్ని పాఠశాలల్లో విద్యార్ధులకు తనిఖీ చేసి విద్యార్ధుల పేర్లు నమోదు చేసుకోవడం, రెండవ దశలో వారందరికీ నవంబరు 1 నుంచి కంటి వైద్యులతో ప్రత్యేక తనిఖీలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్ళద్దాలు పంపిణీ, అవసరమైనవారికి కంటి చికిత్సలు అందచేయడం జరుగుతుందని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం అయ్యేలా విద్యార్ధులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు సహకరించాలని వైద్యాధికారిణి కోరారు. వైద్య శిభిరం కార్యక్రమంలో గవరవరం సి.హెచ్.వో శ్యామలాదేవి, సూపర్‌వైజర్లు కళావతి, సత్యవాణి, చినతల్లి, కనకవేణి, ఏఎన్ఎంలు వరలక్ష్మి, భోగాపురం ఏఎన్ఎం కరుణ, అంగన్వాడీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక కాలంలోనూ అభివృద్ధికి ఆమడ దూరం

## సిరాగం గ్రామస్తుల ఆందోళన



అరకులోయః అరకులోయ మండలానికి చెందిన సిరాగం పంచాయతీ సిరాగం గ్రామంలో గిరిజనులు అనేక సమస్యల నడుమ ఎన్నో అవస్థలు పడుతున్నారు.గ్రామంలో కనీసం త్రాగడానికి మంచినీరు లేదు. మంచినీరు కోసం సుమారు రెండుమూడు కిలోమీటర్ల దూరం వెళ్లి గుక్కెడు మంచినీరు ఊట గెడ్డ నుంచి తెచ్చుకొని త్రాగి అనేక రోగాల బారి పడాల్సిన పరిస్థతి అని గ్రామ మహిళాలు అంటున్నారు. అప్పట్లో కొళాయి గొట్టాలు వేసి రెండుమూడు ఏడాది అవుతున్న సంభందిత గుత్తేదారుడు జాడ లేకుండ పోయాడు అంటున్నారు. గ్రామంలో కనీసం సిమెంటు రోడ్డు లేదు. డ్రైనేజీ లేదు, చిన్నారులు చదువుకోవడానికి సరైన పాఠశాల భవనం లేదు.శిధిలమైన పాఠశాల భవనంలోనె చిన్నారులు చదువును అభ్యసిస్తున్నారు. అంగాన్వాడి భవనం అయితే మరి ఘోరం అని గ్రామస్థులు అంటున్నారు. పంచాయతీ హెడ్డుక్వార్టర్ గ్రామమే ఇలా ఉంటే పంచాయతీ, పక్కపక్క గ్రామాల పరిస్థితి ఇంకా చాల దారుణంగా ఉన్నాయని గ్రామస్థులు అంటున్నారు. తమ గ్రామంలో ఉన్న సమస్యలు ప్రభుత్వం వారు తెలుసుకొని పరిష్కరించాలని గ్రామస్థులు రాంబాబు తదితరులు ఆవేధన చెందుతున్నారు.


మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ VIZAG

**బహిరంగ వేలం**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ, జోన్-I, వార్డు నెం.1 పరిధిలో ఈ దిగువ పేర్కొన్న గుత్తలను **తేది 18-10-2019 ఉదయం 11 గం..లకు జోన్-I** జోనల్ కార్యాలయం మధురవాడ నందు బహిరంగ వేలము నిర్వహించుట జరుగుతుంది. కావున ఆశక్తి గల వారు ఈ యొక్క గుత్తను బహిరంగ వేలము పాటలో పాడుకొనుటకు హాజరు కాగలరని ఇందుములముగా తెలియజేయడమైనది

1) ముడసర్లోవ కాంటీన్, వార్డు నెం.1
2) ముడసర్లోవ పార్కింగ్ రుసుం వార్డు నెం.1
3) ఆరిలోవ లాస్ట్ బస్సు స్టాప్ నందుగల కళ్యాణమండపం వార్డు నెం.1
4) బాలాజీ నగర్ షాపింగ్ కాంప్లెక్స్ వార్డు నెం.2
5) పివి నరసింహరావు కళ్యాణమండపం వార్డు నెం.5

మరిన్ని వివరాలకై సంబంధిత జోనల్ కార్యాలయములో రూ.200/- చెల్లించి సేల్ నోటిఫికేషన్ ద్వార తెలుసుకోగలరు

జోనల్ కమీషనర్
జోన్-I , జి.వి.ఎం.సి.

స్వచ్ఛ ఆంధ్ర | స్వచ్ఛ విశాఖ

ఇంటింట మరుగుదొడ్డి - బహిరంగ మల విసర్జనకు స్వస్తి


# కంటి వెలుగు, నేత్రదానంపై అవగాహన ర్యాలీ




చోడవరంః మండలంలోని తిమ్మనపాలెం గ్రామంలో డాక్టర్ వై.యస్.ఆర్, కంటి వెలుగు కార్యక్రమం నేత్రదానంపై స్థానిక మండల పరిషత్తు ప్రాధమిక పాఠశాల విద్యార్ధులు శనివారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుదర కామరాజు ఆధ్వర్యంలో గ్రామంలో వీధులలో తిరుగుతూ కంటి వ్యాధులు, ఇతర సమస్యలు, వాటి నివారణ చర్యలపై ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అప్పలరాజు, అంగన్‌వాడీ కార్యకర్త ఆర్ నాగమణి, భవానీ, కాసులమ్మ పాఠశాల విద్యార్ధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాదినాటికి జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయించండి

- ముఖ్యమంత్రి, హామీని అమలు చేయాలి
- మంత్రి ముత్తంశెట్టికి విజెఎఫ్ వినతి



విశాఖపట్నంః రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉగాది నాటికి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళ స్థలాలు కేటాయించాలని వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ కార్యవర్గం కోరింది. ఈ మేరకు ఫోరమ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు శనివారం మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ యం.పి ఎం.వి.వి. సత్యనారాయణలను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఉగాది పర్వదినం సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఒక్కొక్క జర్నలిస్టుకు మూడు సెంట్లు చొప్పున స్థలాన్ని ఉచితంగా కేటాయించాలని కోరారు. ఈ విషయమై ప్రభుత్వం తక్షణమే దృష్టిసారించాలని అందుకు తమ వంతు సహకారం అందించాలని వీరంతా మంత్రిని కోరారు. దీంతోపాటు ఉపసంపాదకులకు అదనంగా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని మంత్రికి వీరు విజ్ఞప్తి చేసారు. గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు రైల్వే పాస్‌లు మంజూరు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఆయా అంశాలపై మంత్రి, యంపి సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు కేటాయించేందకు అవసరమైన చర్యలు చేపడుతున్నారని, మంత్రి బొత్స సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ఏర్పాట్లు జరుగుతున్నాయని వారు వివరించారు. మంత్రి, యంపిని కలిసిన వారిలో విజెఎఫ్ కార్యదర్శి ఎస్. దుర్గారావు, ఉపాధ్యక్షులు ఆర్. నాగరాజ్ పట్నాయక్, జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్, కార్యవర్గ సభ్యులు ఇరోతి ఈశ్వరరావు, గిరిబాబు, మాధవరావు, డేవిడ్, శేఖర్ మంత్రి, డేవిడ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ జిల్లా కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఎన్ఏడి భాష్యం విద్యార్థుల ప్రతిభ



విశాఖపట్నంః గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో జరిగినటువంటి విశాఖ జిల్లా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో భాష్యం ఎన్ఏడీ బ్రాంచినందు 8వ తరగతి చదువుతున్న మాస్టర్ పసుపురెడ్డి కృష్ణ వంశీ, 45 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా భాష్యం ఎన్ఏడీ ప్రిన్సిపాల్ కె. మణికంఠా రెడ్డి విద్యార్థిని అభినందిస్తూ భాష్యం విద్యార్థులు ఇటు చదువులోనే కాకుండా, అటు క్రీడల్లోనూ రాణించడం తమకెంతో గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ భాష్యం జోనల్ ఇన్‌ఛార్జి కె. వెంకట్, ఉపాధ్యాయ మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది మాస్టర్ కృష్ణవంశీ మరియు జ్యోతిలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కుదేలౌతున్న పారిశ్రామిక రంగం

- ఎన్.డి.ఏ ప్రభుత్వ విధానాలే కారణం
- 16 న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో రాస్తారోకోలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



గాజువాక: కేంద్రం లోని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్.డి.ఏ (బీ.జె.పీ) ప్రభుత్వ విధానాల తో పారిశ్రామిక రంగం కుదేలయ్యిందని సీ.పీ.ఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గాజువాక లోని ఓ హొటల్ లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో "ఆర్థిక మాంద్యం - ప్రజలపై భారం" అనే అంశం పై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీ.పీ.ఐ రాష్ట్ర కార్యదర్శి రామక ృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం లోని బీ.జె.పీ ప్రభుత్వం ప్రజలపై, కార్మిక వర్గంపై నిత్యం దాడులకు పూనుకుంటున్నదని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తున్నదని, ఇప్పటికే దేశంలోని అనేక ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించిందన్నారు. లాభాల బాటలో పయనిస్తున్న పరిశ్రమలలోని వాటాలను విక్రయించేందుకు కుట్రలు పన్నుతున్నదన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించి, బడా పెట్టుబడిదారులకు కారు చౌకగా అమ్మెందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి నిరుద్యోగాన్ని పెంచేందుకు నరేంద్ర మోడీ పన్నాగం పన్నుతున్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, యువతకు ఉపాధి అవకాశాలు , ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడకుంటే ఉద్యమాల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్తామన్నారు. ఈ నెల 16 న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీ.పీ.ఎం నగర నాయకులు ఎం.జగ్గు నాయుడు, రాంబాబు, రాజేంద్ర ప్రసాద్, సీ.పీ.ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.జె.స్టాలిన్ , నగర కార్యదర్శి మరిపల్లి పైడి రాజు, నగర కార్యవర్గ సభ్యులు బి.వెంకట్రావు, కసిరెడ్డి సత్యనారాయణ, టి.సాంబ మూర్తి, ఎల్లేటి శ్రీనివాసరావు, అప్పారి విష్ణు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా గడువు పెంచాలి

## సిపిఎం డిమాండ్

విశాఖపట్నంః రైతు భరోసా పథకం క్రింద రైతులు ధరఖాస్తు చేసుకొనేందుకు గడువుతో నిమిత్తం లేకుండా అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది. జిల్లాలో మొత్తం లబ్ధిదారులు 5 లక్షల 48 వేల 33 మంది కాగా 3 లక్షల 80 వేల 500 మందికి అర్హత ఉన్నదని, ఇంకా 1 లక్షా 67 వేల 533 మందిని వివిధ సాంకేతిక కారణాల రీత్యా తిరస్కరించడం జరిగిందని, ఇది అన్యాయమని సీపీఎం డిమాండ్ చేసింది. సాంకేతిక కారణాల వల్ల రైతుల వద్ద కొన్ని ధృవీకరణ పత్రాలు లేకపోవడం వల్ల వారికి భరోసా వర్తింపజేయకపోతే రైతులు నష్టపోతారు. రైతు భరోసా పథకాన్ని ఈ నెల 15 రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తుంది. ప్రారంభ తేదీలోపే ధరఖాస్తు చేసుకోవాలని గడువు విధించడం సముచితంకాదు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా పథకం ప్రయోజనం దక్కేలా అక్టోబర్ నెలాఖరి వరకు గడువు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. గడువు లేదన్న పేరుతో అర్హత కలిగిన ఏ ఒక్క రైతు నష్టపోకుండా భరోసా అందేలా చర్యలు తీసుకోవాలి.

క్రిందస్థాయిలో రైతుల అభ్యంతరాలను, ఆధార్ సీడింగ్, ప్రజాసాధికార సర్వే, వెబ్‌ల్యాండ్, సంబంధింత ధృవీకరణ పత్రాలను స్వీకరించి అవసరమైన సేవలు ప్రభుత్వాధికారుల ద్వారా తక్షణమే అందేలా ఆదేశాలు జారీ చేయాలి. భూ యజమాని అంగీకారంతో నిమిత్తం లేకుండా సాగుదారులైన కౌలురైతులకు సాగుహక్కు ప్రతం మంజూరు చేసే అధికారం తహశీల్దార్, వి.ఆర్.ఒలకు ఇవ్వాలి. ఆ పత్రం ఆధారంగా కౌలు రైతులందరికీ రైతు భరోసా వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

# మాధవధారలో వై.యస్.ఆర్.కంటి వెలుగు



మాధవధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం 39వ వార్డు మాధవధార జివిఎంసి హైస్కూల్‌లో జరిగిన వై.యస్.ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు . ఈ కార్యక్రమంలో 39వ వార్డు అధ్యక్షురాలు పి.సునీత, రేయ్యి వెంకటరమణ, నాంభాళ ఈశ్వరావు, నాంభాళ రాజేష్, పైడి శ్రీను, కృష్ణారావు మాస్టర్, తిరుమలరావు, సుమతి, పి.చంద్రశేఖర్ రెడ్డి, దమయంతి, సోనీ, రత్న, వెంకట్, యం.లక్ష్మి, మాలతి, రాధ, సంతోష్, చైతన్య, జగదీష్, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### దుర్గా నవరాత్రుల సందర్భంగా పేద మహిళలకు చీరల పంపిణీ

విశాఖ ఉత్తర నియోజకవర్గం 39వ వార్డు రాజీవ్ నగర్ శ్రీ శ్రీ శ్రీ దుర్గాదేవి నవరాత్రి మహోత్సవములులో భాగంగా అమ్మవారిని దర్శించుకొని అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని పేదప్రజలకు ఉచితంగా చీరలు పంపిణీ చేసిన విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు. ఈ కార్యక్రమంలో నాంభాళ రాజేష్, రత్న, వెంకట్, యం.లక్ష్మి, సంతోష్, చైతన్య, 39వ వార్డు నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సౌత్ జోన్ మహిళా టెన్నిస్ విజేత ఉస్మానియ జట్టు




సాగర్‌నగర్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 10వ తేదీన ప్రారంభం అయిన దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ (మహిళల) టెన్నిస్ పోటీలు శనివారం ముగిశాయి. శనివారం జరిగిన ఫైనల్స్‌లో మద్రాస్ యునివర్సిటీపై ఉస్మానియా యూనివర్సిటీ జట్టు 2-0 స్కోరుతో తిరుగులేని విజయం సాధించింది. మద్రాస్ యూనివర్సిటీ జట్టు రన్నరప్‌గా ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడవ స్థానం కోసం ఆతిధ్య గీతం యూనివర్సిటి జట్టు ఆంధ్ర యూనివర్సిటీతో తలపడి హెూరాహెూరిగా పోరాడి ఓటమిపాలై నాల్గోస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభకు గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ ముఖ్య అతిధిగా హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ ఫైనల్స్‌లో మొదటి నాలుగు స్థానాలలో నిలిచిన జట్లు డిసెంబర్‌లో గ్వాలియర్‌లో జరిగే అఖిల భారత స్థాయి పోటీలలో పాల్గొంటాయని గీతం స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి, పోటీల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కె.రామకృష్ణారావు తెలిపారు. బహుమతి ప్రధానోత్సవ సభకు వివిధ రాష్ట్రాల క్రీడాకారిణిలు, జట్టు మేనేజరులు హాజరయ్యారు.

**ఫైనల్ ఫలితాలు :**

పోటీలలో మద్రాస్ యూనివర్సిటీ జట్టుపై ఉస్మానియా యూని వర్సిటీ జట్టు 2-0 స్కోర్‌తో విజయం సాధించింది. ఉస్మానియా జట్టు క్రీడాకారిణీలు టి.శ్రావ్య ప్రత్యర్థి జట్టు క్రీడాకారిణి మేఘన పై కోలుకోలేని విధంగా 6-2,6-1 స్కోరుతో పూర్తి ఆధిపత్యం కనబరిచి విజయం సాధించగా మరో క్రీడాకారిణి శ్రావ్య ప్రత్యర్థి క్రీడాకారిణి సాయిపై 6-3, 6-3 స్కోరుతో విజయం సాదించింది. మూడోస్థానానికి జరిగిన పోటీలలో ఆంద్రా యూనివర్సిటీ జట్టు 2-1 స్కోరుతో గీతం యూనివర్సిటీ జట్టుపై విజయం సాధించింది.

# సూక్ష్మపోషకాల లోపంతో పంటల దిగుబడి తగ్గుముఖం

## గీతం సైన్స్ ప్రొఫెసర్ అనీమా దధిచి



సాగర్‌నగర్: భారత దేశంలో హరిత విప్లవం తరువాత కూడా పెరుగుతున్న జనాభాకు అవసరం అయిన మేర ఆహర ఉత్పత్తులు వృద్ధి చెందకపోవడానికి, పంటల దిగుబడి తగ్గడానికి కారణం సూక్ష్మపోషకాల లోపం కారణం అని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ అనీమా దధిచి పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన రీసెర్చి ఫోరం సమావేశంలో ఆమె ప్రసంగించారు. దేశంలోని 15 వరకు గల వివిధ రకాల వ్యవసాయ మండలులలో (ఎగ్రికల్చర్ జోన్‌లు) ఈశాన్య ప్రాంతంలో గల నేలలలో బోరాన్ వంటి సూక్ష్మ పోషకాల లోపం అధికంగా ఉందని గుర్తించినట్లు అమె తెలిపారు. బోరాన్, కాపర్, ఐరన్, మాంగనీస్, జింక్ వంటి సూక్ష్మ పోషకాలు వ్యవసాయ భూములలో ఉండటం వల్ల పంటల వృద్ధికి దారితీస్తుందన్నారు. రోజుకు 10 మిల్లీగ్రాముల బోరాన్ ఆహరంలో స్వీకరించడం కీళ్ళ వాతం వంటి రోగాలను, మహిళలలో మోనోపాజ్ సమయంలో వచ్చే సమస్యలను దూరం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా తాము వ్యవసాయ భూములపై జరిపిన పరిశోధనా ఫలితాలను అమె వివరించారు.

రీసెర్చి ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.గణపతి అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ మాట్లాడుతూ అంతర్ విభాగపరిశోధనలపై గీతం శాస్త్ర విభాగాలు దృష్టి సారించాలని సూచించారు.

# ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తన గానం

విశాఖపట్నం : అన్నమయ్య పదకోకిల పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్ స్థాపించిన అన్నమాచార్య భావనా వాహిని విశాఖ నగర శాఖ ఆధ్వర్యంలో రామ్‌నగర్ మెయిన్‌రోడ్డు దరి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన గాత్రకచేరి ఆహుతులను ఆకట్టుకుంది. నగరానికి చెందిన ప్రముఖ గాయని జె.మాధవికృష్ణ వారి శిష్యబృందం అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించి విచ్చేసిన భక్తజనుల మన్ననలను పొందారు. సంకీర్తనా కార్యక్రమానికి తబలాపై హరివంశీ, తాళంపై ఎం.వెంకటరాజశేఖర్‌లు సహకరించారు. దీనికిముందు సామూహికంగా శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించినాము.



# విజయభాను సంపాదకీయం

## కుర్దుల భద్రత ముఖ్యం

ఇస్లామిక్ తీవ్రవాదులపై ఇంతకాలం నాటో సైన్యాలకు మద్దతుగా ముందుండి పోరాడిన కుర్దులకు భద్రత కల్పించకుండా అమెరికా ద్రోహానికి పాల్పడటం అత్యంత దారుణం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆయన పార్టీలోని వారు, సైనికాధికారులు కూడా తప్పుపడుతున్నారు. అమెరికా మిత్రదేశాలు కూడా తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఐఎస్ ఉగ్రవాదులను తుదముట్టించేందుకు ఇంతకాలం అమెరికాకు కుర్దుల మద్దతు ఎంతో ఉపయోగపడ్డది. కుర్దులు అందించిన సహాయానికి ప్రతిగా సిరియా సరిహద్దు ప్రాంతంలోని కుర్దులపై టర్కీ దాడులకు పాల్పడకుండా కాపాడటం అమెరికా బాధ్యత. సిరియాలోని ఈ కుర్దులు తమ దేశంలోని కుర్దు తిరుగుబాటుదారులకు తోడ్పడుతున్నారనేది టర్కీ ఆరోపణ. ఇంతకాలం సరిహద్దులో ఇరువర్గాల మధ్య పోరాటం జరుగకుండా అమెరికా సైన్యం ఉండేది. అమెరికా నామమాత్రంగా సైన్యాన్ని పెట్టినా ఇంతకాలం టర్కీ దాడి జరుపకుండా నిరోధించింది. ఇప్పుడు టర్కీతో లోపాయికారి అవగాహన కు వచ్చిన ట్రంప్ హటాత్తుగా సరిహద్దులోని తమ సైనికులను సిరియా భూభాగం లోపలికి తరలిస్తున్నామని ఆదివారం ప్రకటించారు. దీంతో టర్కీ సైన్యాలు భారీఎత్తున సిరియా సరిహద్దు దాటి కుర్దు ప్రాంతాలపై దాడులు సాగిస్తున్నాయి. ఇప్పటికే దాదాపు అరువై వేల మంది ప్రజలు సిరియా భూభాగం లోపలికి వలసవెళ్ళారు. కొన్ని లక్షల మంది నిర్వాసితులవుతారని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అమెరికా సైనిక చర్యల మూలంగా లక్షలాది మంది దేశదేశాల్లో శరణార్థులుగా మారిపోయారు. ఇప్పుడు మళ్ళా సిరియా-టర్కీ సరిహద్దులో దాడులు ప్రారంభం కావడంతో మరో సంక్షోభానికి తెరతీసినట్టయింది. పశ్చిమాసియాలో ఇస్లామిక్ రాజ్యస్థాపన కోసం ప్రాణాలకు తెగించి అత్యంత భయంకరంగా ముంచుకువస్తున్న ఐఎస్ ఉగ్రవాదులను ఎదుర్కొనే శక్తి సిరియా సైన్యానికి లేదు. అప్పటికే అమెరికా సిరియాలో తలదూర్చి అక్కడి ప్రభుత్వాన్ని బలహీనపరిచింది. మరోవైపు ఇరాక్ సైనికులు కూడా చేతులు ఎత్తేసిన పరిస్థితి. ఇరాక్‌లో సద్దాం ప్రభుత్వాన్ని కూలదోసి ఆ దేశాన్ని కకావికలం చేసిన అమెరికా సిరియాలో కూడా అస్సా ద్ పాలనను కూలదోయాలని ప్రయత్నించింది. కానీ రెండు దేశాలలో ఐఎస్ ప్రాబల్యం పెరిగిపోయింది. మళ్ళా ఐఎస్‌ని ఎదుర్కొనే శక్తి ఈ రెండు దేశాలకు లేకపోవడంతో, అమెరికా కూడా సైన్యాన్ని మోహరించలేని పరిస్థితి ఏర్పడ్డది. ఈ నేపథ్యంలో సొంత దేశం కోసం పోరాడుతున్న కుర్దులను ఉపయోగించుకోవాలని అమెరికా నిర్ణయించింది. అయితే టర్కీ దాడుల నుంచి రక్షణ కల్పిస్తేనే కుర్దులు ఐఎస్ ఉగ్రవాదులతో పోరాడగలరు. దీంతో సిరియా-టర్కీ సరిహద్దులో అమెరికా నామమాత్రంగా సైన్యాన్ని మోహరించి కుర్దులకు భద్రత కల్పించింది. ఇప్పుడు హటాత్తుగా ట్రంప్ టర్కీతో అవగాహనకు వచ్చి సరిహద్దులో సైనికులను ఉపసంహరించుకున్నాడు. సరిహద్దు ప్రాంతంలోని కుర్దు సైనిక స్థావరాల గూఢచార సమాచారాన్ని కూడా అమెరికా టర్కీకి అందించింది. కుర్దులకు చేసిన ద్రోహా న్ని కప్పిపుచ్చుకోవడానికి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా హాస్యాస్పదంగా ఉన్నాయి. రెండవ ప్రపం చయుద్ధంలో అమెరికాకు కుర్దులు సహకరించలేదు, నార్మండీ పోరాటంలో మద్దతు ఇవ్వలేదని చెప్పడం ద్వారా ట్రంప్‌నకు ఉన్న చారిత్రక, భౌగోళిక పరిజ్ఞానం ప్రశ్నార్థకమవుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో (ఇప్పటికీ) కుర్దు దేశమే లేనప్పుడు మద్దతు ఎట్లా ఇవ్వగలరు. నార్మండీ సమీప ప్రాంతమైతే కుర్దులు ఇప్పటి మాదిరిగా సహకరించలేదనవచ్చు. కానీ ఎక్కడ ఫ్రాన్స్‌లోని నార్మండీ, ఎక్కడ పశ్చిమాసియాలోని కుర్దులు! ఇరాన్, ఇరాక్, సిరియా, టర్కీ దేశాల్లోని పొలిమేర ప్రాంతాల్లో ఉన్న కుర్దులు సొంత దేశం కోసం ఎంతోకాలంగా పోరాడుతున్నారు. నాలుగు బలమైన దేశాలపై ఏకకాలంలో పోరాడవలసి రావడం వల్ల ప్రపంచదేశాల మద్దతు లభించడం లేదు. అమెరికా జోక్యం చేసుకున్న ఈ సందర్భంలోనైనా తమకు సొంత దేశం ఏర్పడుతుందని కుర్దులు ఆశించారు. కానీ అమెరికా నమ్మించి మోసం చేసింది. కుర్దులు వారి దేశం కోసం వారు పోరాడుతున్నారంటూ ట్రంప్ తేలికగా తీసిపారేయడం కూడా నైతికంగా సమర్థనీయం కాదు. తమ దేశం కాకపోతే కుర్దులు అమెరికాకు ఎందుకు సహకరించినట్టు? ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం అమెరికా బాధ్యత. ప్రభుత్వాలు, నాయకులు మారిపోతూ ఉండవచ్చు. అయినా దేశాలు తాము ఇచ్చిన హామీల మీద నిలబడాలె. ఇతర దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను గౌరవించాలె. ఒప్పందాలను గౌరవించకపోవడం, రహస్య ఒప్పందాలకు పాల్పడటం వల్ల దేశాల మధ్య పరస్పర విశ్వాసం దెబ్బతింటుంది. ఇటువంటి ఏ కట్టుబాట్లు, నీతి నియామాల్లేని పరిస్థితి వల్లనే రెండు ప్రపంచయుద్ధాలు సాగి, అంతులేని మారణహోమాన్ని సృష్టించాయి.



శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి నవరాత్రి సంబరాలలో భాగంగా సెంటర్ పాయింట్ ఆటోస్టాండ్ సభ్యుల ఆద్వర్యంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ వెనుకభాగాన గల లారీ వర్కర్స్ వారి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సాయి పూజా ఫౌండేషన్ చైర్మన్, 27వ వార్డు మాజీ కార్పొరేటర్ వానపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



**27వ వార్డులో కృష్ణా గార్డెన్ దుర్గ గుడి దగ్గర అమ్మవారు అన్న సంతర్పణ కార్యాక్రమం 500 మందికి అన్న సమారాధన జరిగింది. ఈ కార్యాక్రమంలో 27వ వార్డు టిడిపి అధ్యక్షుడు బాపు ఆనంద్, సారిపల్లి మహేష్, శ్రీనివాస్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.**

## జాయింట్ కలెక్టర్-2గా బాధ్యతలు స్వీకరించిన గున్నయ్య



శ్రీకాకుళం: శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ -2గా రెడ్డి గున్నయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా ప్రగతి పథంలో ఉండుటకు తన వంతు కృషి చేస్తానన్నారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో, ఆయన సూచనల మేరకు బాధ్యతలను చక్కగా నిర్వర్తించుటకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. జిల్లాలో డిప్యూటి తహశీల్దారుగా విధుల్లో చేరినప్పటి నుండి భూ సేకరణ ఉప కలెక్టర్ గా, పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారిగా పనిచేసిన అనుభవం ఉందని, జిల్లాపై పూర్తి అవగాహన ఉందని గున్నయ్య తెలిపారు. విశాఖపట్నం జిల్లా రెవిన్యూ అధికారితో సహా వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం ఉందన్నారు. వంశధార భూసేకరణ ఉప కలెక్టర్ గా బాధ్యతలను నిర్వహిస్తున్న నన్ను జాయింట్ కలెక్టర్ -2 గా ప్రభుత్వం నియమించడం ఆనందంగా ఉందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ -2గా మంచి సేవలు అందించుటకు అన్ని విధాలా కృషి చేస్తానని చెప్పారు. సంక్షేమ శాఖలు మంచి ప్రగతి కనిపించే విధంగా సమన్వయం చేయుటకు ప్రయత్నిస్తామని తెలిపారు.

జాయింట్ కలెక్టర్ -2గా బాధ్యతలు చేపట్టిన రెడ్డి గున్నయ్యకు జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి రాజేశ్వర రావు, జిల్లా విద్యా శాఖ అధికారి కె.చంద్ర కళ, జిల్లా పౌరసరఫరాల అధికారి జి.నాగేశ్వర రావు, జిల్లా పౌరసంబంధాల అధికారి ఎల్.రమేష్, మీడియా ప్రతినిధులు తదితరులు అభినందనలు తెలిపారు.

## కవి సమయం

### భక్తి మార్గం - దైవ సంకల్పం

పారిపోతే ఊరుకోరు ఊరువారు
పరుపరుగున పట్టుకుంటు దేవుడుని
రోజువారి దేవుడంటే ప్రేమతో
ప్రేమ ప్రజలు కళ్ళల్లో దేవుడని.
చెప్పింది చేస్తున్న దినంవారి
శిరస్సొంచి మొక్కుతున్న రోజువారి
మలినమును తీసేసి
మనసు నిండ మంచిని నింపేసి.
విశ్వమంత మీరేగ
ఎండ, వాన, గాలి, మీదేగ
నిమి నిముషం కదలికలో
అడుగడుగున నడకల్లో
దేవుడే - దేవుడు.
ఇబ్బంది పుచ్చుకుంటు
కళ్ళ కద్దు కున్నవారు
ప్రాప్తిని మొక్కుకుని
దేవ, దేవ అనుకుని
ప్రాప్తిని మెచ్చుకో... ఇబ్బంది దేవుడని మొక్కుకో...
చేసింది ఎంతైన
శ్రమ హెచ్చని నొచ్చుకోకు
భాగ్యాన్ని యిచ్చినోడు
భగవంతుడుని వేడుకో.
నిత్యం, సత్యం నీ వెంటే ఆ వెంబడి నడక నీవంటు
అందులోన ఎంతైన దాగుంది
పరమాత్మ, పరమావధి, అందుంది.
సర్వం శక్తిలోన మహిమే
అణువంతకానొస్తే-
మహా మనిషైతేనే; ఆ శక్తిని సమాజానికివ్వాలి
సమాజం మార్పునకు-
శ్రమనెంతైన మోయాలి.
మీలో వున్నది ఎంతైన
అది నిలుపుకో మంటుంది దైవం
అదియే పరమావధి శక్తుంది
మీకు తోడుగ దైవముంటుంది.

... కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

## జగన్ పాలన చూసి ఓర్వలేకే బాబుకు భయం



విశాఖపట్నం : విశాఖ పర్యటనలో భాగంగా మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై అనకాపల్లి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో టీడీపీ స్థాపించిన తర్వాత ఇంత ఘోరమైన ఫలితం ఎప్పుడైనా వచ్చిందా అని ప్రశ్నించారు. 1999లో వాజ్‌పేయి ఒక్క ఓటుతో ఓడిపోవటం, కార్గిల్ యుద్ధ నేపథ్యంలో ఆనాడు ఎన్నికల్లో చంద్రబాబు విజయాన్ని సాధించి అధికారాన్ని చేజిక్కించుకున్నారని అమర్‌నాథ్ అన్నారు. దేశంలో అనేక రాష్ట్రాలు జగన్ పాలనను ఆదర్శంగా తీసుకుంటున్నాయి అని అమర్‌నాథ్ తెలిపారు.

**జగన్ పాలన చూసి ఓర్వలేక బాబుకు భయం**

చంద్రబాబుకు మతిపోయిందో.. మత్తు ఎక్కి మాట్లాడుతున్నారా? జగన్ గారి పరిపాలనను అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటుంటే చూసి ఓర్వలేక చంద్రబాబు ప్రేలాపనలు చేస్తున్నారు. చంద్రబాబుకు మతిపోయిందో, మత్తు ఎక్కి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని అమర్‌నాథ్ అన్నారు. తనకు తెల్సినంతలో చంద్రబాబుకు మందు అలవాటు లేదని, అధికారం పోయాక మందు అలవాటు వచ్చిందేమో తెలీదని అమర్‌నాథ్ అనుమానం వ్యక్తం చేశారు.

**లోకేశ్ రాజకీయ భవిష్యత్ అగమ్యగోచనం**

చంద్రబాబు ఇలా మాట్లాడటానికి లోకేశ్ భవిష్యత్ ముగిసిపోయిందనే కారణంతోనే మాట్లాడుతున్నట్లు కనబడుతోందని అమర్‌నాథ్ అన్నారు. ప్రపంచస్థాయి రాజధాని కడుతున్నానని చెప్పి.. దేశంలో, ప్రపంచస్థాయిలో గొప్పలు చెప్పుకున్నారు. చివరకు అదే రాజధాని ప్రాంతం నుంచి మీ అబ్బాయిని పోటీ చేయిస్తే ప్రజలు చెంపచెల్లుమనిపించారన్నారు. లోకేశ్ రాజకీయ భవిష్యత్ ముగిసిపోయినట్లు ఆ బాధతో చంద్రబాబు మాట్లాడుతున్నట్లు కనిపిస్తోందని అమర్‌నాథ్ అన్నారు.

**మంచి ముఖ్యమంత్రిగా జగన్ పాలన చేస్తున్నారు**

రాబోయే 6నెలల్లో మంచి ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకుంటానని ప్రమాణస్వీకారం సందర్భంగా జగన్ అన్న సంగతిని ఈ సందర్భంగా గుడివాడ గుర్తు చేశారు. 6నెలల్లో మంచి ముఖ్యమంత్రే కాదు.. గొప్ప ముఖ్యమంత్రి అని జగన్ అనిపించుకుంటున్నారని అమర్‌నాథ్ అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు, బీహెచ్‌పీని ఎల్‌అండ్‌టీకి ఇచ్చేద్దాం.. చుట్టుప్రక్కల కొండల్ని గీతంకు ఎప్పుడు ఇచ్చేద్దామని చంద్రబాబు చూశారని అమర్నాధ్ మండిపడ్డారు. హుద్‌హుద్ తుఫానులో జూకి చిన్న నష్టం జరిగితే దాన్ని ఎప్పుడు తరలించేద్దామని చూశారన్నారు. ఎప్పుడు ఎవరికి దీన్ని కష్టపెడదామనే ప్రయత్నం తప్పితే.. ఏ రోజైన విశాఖకు మేలు చేసే కార్యక్రమం చంద్రబాబు చేశారా అని గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. విశాఖపై కలలు కన్నాను. అభివృద్ధి చేశాను అని కపట ప్రేమ చూపిస్తే విశాఖ ప్రజలు మోసపోరు. అంతా మేనేజ్‌మెంట్ తప్ప ఇంకేమీ లేదు. విశాఖకు జరిగిన మేలు అంతా ఆనాడు వైయస్సార్ హయాంలో.. ఇప్పుడు రాబోయే ఐదేళ్లలో జరగబోతోందని అమర్ అన్నారు.

**టీడీపీ భవిష్యత్ ముగిసిపోయింది**

ఎటొచ్చీ టీడీపీ తాలూక భవిష్యత్ ముగిసిపోయింది. ఓవైపు చంద్రబాబుకు 70 సంవత్సరాలు వచ్చేశాయి. కొడుక్కి భవిష్యత్ లేదు. మీరు ఏం చేయాలో తెలియక మాట్లాడిన మాటలు కళ్లెదుట కనిపిస్తున్నాయి. శాంతిభద్రతల వ్యవహారంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్న పోలీసుల్ని 14 ఏళ్ళ జైల్లో చంద్రబాబు పెడతామనటం ఏంటని, వారిని వైయస్‌ఆర్‌సీపీ కార్యకర్తల్లా పార్టీలో చేరమనటం దేనికి సంకేతమని గుడివాడ ప్రశ్నించారు. అంటే గత ఐదేళ్లు టీడీపీలో పోలీసులు పనిచేశారా అని గుడివాడ అమర్నాధ్ ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన గురించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. పిచ్చోడి చేతిలో రాయి ఉంటే ఎలా ఉంటుందో గత ఐదేళ్లలో బాబు పాలనలో జనాలు స్వయంగా అనుభవించారని అమర్‌నాథ్ గుర్తు చేశారు.

**గతంలో పోలీసులతో మీరు ఏం చేశారో గుర్తు చేసుకోండి బాబూ..**

ఆనాడు విశాఖ విమానాశ్రయంలో వైయస్ జగన్‌పై దాడి జరిగితే ప్రిలిమినరీ ఎంక్వైరీ లేకుండా మీరు, మీ డీజీపీ ముందుకు వచ్చి వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తే జగన్‌పై దాడి చేశారని అన్నారు.

**చౌకబారు విమర్శలు ఆపు బాబు**

విశాఖపట్నంలో దాడులు జరిగితే కదా? చంద్రబాబు పరామర్శలు చేసేది. ఇక్కడ ఎవ్వరూ జూనియర్ ఆర్టిస్టులు లేరని అమర్నాధ్ అన్నారు. విశాఖలో కొబ్బరికాయ కొట్టినా, పోలవరం గేట్లు ఎత్తినా.. అమరావతిలో ఏం చేసినా మళ్లీ నువ్వే రావాలి బాబూ అంటూ చౌకబారు ప్రచారం చేసుకుంటున్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి పట్టుమని 6నెలలు కాలేదు. అప్పుడే విమర్శలా అని అమర్‌నాథ్ మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్ పరిపాలను మిగిలిన రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటాయని అమర్‌నాథ్ అన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు దాన్ని నిలబెట్టుకోలేక తమపై విమర్శలు చేయడం తగదని అమర్‌నాథ్ హితవు పలికారు.

# సన్మార్గమే నిర్దేశం కావాలి



**నిర్దేశం** అనే పదానికి చూపించు, ఆజ్ఞాపించు, సూచించు అని అర్థాలున్నాయి. నిర్దేశకుడు అంటే ఆజ్ఞాపించువాడు, చూపించువాడని అర్థం. దేనిని చూపాలి? ఏం ఆజ్ఞాపించాలి..? అనేవి ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది. గీతలో అర్జును డికి మార్గోపదేశం చేయడంతో పాటు తానే మార్గ నిర్దేశం అయ్యాడు కృష్ణ భగవానుడు. ఈ జగత్తులో ప్రతి మానవుడు తాను జీవించే విధానం లేదా కర్మల ద్వారా సమాజాన్ని ప్రేరేపిస్తుం టాడు. కొందరు రచనల ద్వారా, మరికొందరు కళల ద్వారా, ఇంకొందరు వృత్తిద్వారా మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నారు. ప్రకృతిలోని ఇతర జీవరాశులు సైతం తమదైన శైలిలో మార్గనిర్దేశం చేస్తుంటాయి.

సత్యయుగంలో మానవులు షోడష కళలతో సర్వ శ్రేష్టంగా జీవించేలా దేవతలు మార్గనిర్దేశం చేశారు. త్రేతాయుగంలో సైతం మానవులు గౌరవం, సోదరభావంతో మెలుగుతూ సామాజిక విలువలను ఉన్నతపథంలో నిలిపారు. ద్వాపర యుగంలో భక్తిమార్గం సమాజానికి సరైన దిశా నిర్దేశం చేసింది. రుషులు, మునులు, తపోధ నులు.. పరమాత్ముడి గుణగణాలను తెలియజేస్తూ ఎన్నో కావ్యాలను వెలువరించారు. ధర్మగ్రంథాలుగా ప్రాచుర్యం పొందిన ఈ కావ్యాలు నేటికి సామాన్య మానవులకు సైతం మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

సాంఘిక జీవనంలో భాగంగా ఉన్న మనం.. ఆ సమాజానికి కీడు తలచడం సరికాదు. ప్రాణికోటి శుభం కోరే పరమాత్ముడి సంతానంగా ఉన్న మనం.. అశుభం కోరడం సమంజసం కాదు. ఎన్ని కష్టాలు ఉన్నా.. మనసా, వాచా, కర్మణా మంచినే కోరాలి. పరమ శివుడు నిర్దేశించిన శ్రీమతం ద్వారా సర్వ సమాజానికి అంతా మంచే జరుగుతుంది. మానవ జీవితంలో ఎదురయ్యే సమస్యలు యుద్ధంలాంటివైతే.. వాటిని ఎలా గెలువగలమో నిర్దేశిస్తూ మరొకరికి మార్గదర్శనం చేయాలి. పలాయనవాదులను చరిత్ర అసమర్థులుగా తేల్చి చెప్పింది. కష్టనష్టాలకోర్చి ముందుకు సాగేవాడే సమర్థుడు. అందుకే స్వామి వికేకానందుడు సమర్థవంతులైన కొందరి జీవితమే చరిత్ర అని వ్యాఖ్యానించారు. బీదవాడుగా జన్మించడం తప్పుకాదు. పేదవాడిగా మరణించడమే తప్పు అంటూ ఓ కవి నిర్దేశించారు. దీన్ని సార్థకం చేసుకున్నవారే సమర్థులు. అలాగని ప్రతి ఒక్కరూ ధనవంతులై పోవాలని కాదు. స్వయంకృషితో ఎదగాలని కవి భావం. ప్రతి వ్యక్తీ తన కుటుంబ పోషణకు సరిపడా ధనం ధర్మమార్గంలో సంపాదించాలి. కాని, అవసరాల కోసం పక్కవాడి పొట్ట కొట్టకూడదు. మాయమాటలు చెప్పి సాయం పొందడం అనైతికం. బీదరికం అనేది జీవిత సామర్థ్యం నిరూపించుకోవడానికి అందిన వరంగా భావించాలి. అందుకు తగ్గట్టుగా ధర్మబద్ధమైన మార్గాన్ని నిర్దేశించుకోవాలి. ఈశ్వరీయ జ్ఞాన యోగాల సంపదను సముపార్జించ కుండా శరీరం వదలడం అంటే మీ జీవనయానం సరైన దిశలో సాగలేదనే అర్థం.

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు ఏది మంచి, ఏది చెడు తెలియజేస్తూ మనుష్యులను ముందుకు నడిపిస్తు న్నాయి. ఆదికాలం నాటి మానవ జీవన విధానం వేదాలలో అక్షర రూపమైందా..? వేదాక్షర రూపాన్ని మానవులు పాత్రగా పోషించి ఇతిహాసం అని అంటున్నారా..? అనేది అసలు ప్రశ్న. అయితే ఈ రెండూ ఒకే చక్రంలో తిరుగుతున్నాయి. ఇందులో ఏది ముందు, ఏది తర్వాత అన్న భేదం లేదు. ఈ రెండూ మనుష్య జాతిని సరైన మార్గంలో నడిపిం చడానికి పరమాత్ముడు సృష్టించిన అద్భుతమైన శక్తులే.

## సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days

**IN THE HON'BLE COURT OF THE IV ADDITIONIAL JUNIOR CIVIL JUDGE, AT : VISAKHAPATNAM**
**O.S.527/2019**

Between:
SYNDICATE BANK,
M V P Colony Branch, Visakhapatnam
Rep. by its Branch Manager ...Plaintiff
And
Sri Ginini Santosh Kumar ...Defendant

**SUMMONS**

To
**The Defendant :**
**Sri Ginini Santosh Kumar,**
S/o. G Bala Krishna,
Hindu, aged about 26 years,
R/at. D.No.5-6-28, Pedajalaripeta,
Peda Waltair, L B Colony,
Visakhapatnam 530017.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other relief's and the suit stands posted to **23-10-2019** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **23-10-2019 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)

**K.DAKSHINA MURTHY (K.D.M)**
Advocate,
Visakhapatnam,
**Cell : 9848146393**

**IN THE HON'BLE COURT OF THE XI ADDL. DISTRICT JUDGE cum M.A.C.T. AT : VISAKHAPATNAM**
**M.O.P. 201/2017**

Between :
Sri Kottakota Srinivasa Rao ...Petitioner
And
1. Sri Nelaturi Naga Kumar
2. Sri Kari Satish
3. M/s. Bharati AXA General Insurance Co. Ltd.,
Rep. by its Branch Manager ...Respondents

**NOTICE**

To,
**Respondent No.2 :**
**Sri Kari Satish, S/o. Tatayya,**
Hindu, aged not known but major,
R/at. D.No.4/70-9A, Opp. Delhi Public School,
Lawsons Bay Colony, Waltair, Visakhapatnam-17.

Please take notice that the above named petitioner filed the above MOP seeking compensation for the injuries sustained by him in a motor accident and for other reliefs. In the said MOP though the notices were sent many a time to you through court and R.P., but you have intentionally avoided to receive the same and also managed postal authorities in serving the said notice through registered post and as such the Hon'ble Court was pleased to issue notice to you through this paper publication.

Therefore, please take notice that the above matter stands posted to **31-10-2019** for your appearance either in person or through your counsel on that day at about **10:30 A.M.** in the above stated Hon'ble Court, failing which the matter will be decided in your absence.

(By Orders of the Hon'ble Court)

**V.S. PAVAN,**
Advocate for Petitioner
Visakhapatnam.
**Cell : 9848119594**

**IN THE HON'BLE COURT OF THE XII ADDL. DISTRICT JUDGE cum M.A.C.T, AT : VISAKHAPATNAM**
**M.O.P. 488/2019**

Between :
Sri Saragada Nookalamma & others ...Petitioners
And
Sri K. Tirumala Raju & others ...Respondents

**NOTICE**

To,
**Respondent No.1**
**K. Tirumala Raju,**
S/o. Veera Swamy,
R/at. D.No.61-2-77, Jagannadhapuram,
Kakinada, East Godavari District
(Driver of the Car bearing Reg. No. AP 05 EX 9999)

Please take notice that the above named petitioners herein has filed the above M.O.P. against you for claiming compensation and the matter stands posted to **23-10-2019** for your appearance. You are hereby required to appear in the Hon'ble Court either in person or through duly instructed Advocate on **23-10-2019 at 10:30 A.M.** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

**A.RAM MOHAN,**
Advocate
Main Road Gopalapatnam,
Visakhapatnam,
**Cell : 9440119620**

**IN THE HON'BLE COURT OF THE XI ADDL. DISTRICT JUDGE cum (S.C & S.T) AT : VISAKHAPATNAM**
**A.S.333/2018**

Between :
Yelamanchili Appayyamma & 2 others ...Appellants
And
Koyya Satya Rao & 6 others ...Respondents

**NOTICE**

To,
**Respondent No.5 :**
**Indrani Syamala Devi,**
W/o. not known, 53 years,
R/at. Purushotha Puram, G.V.M.C. Visakhapatnam.
**Respondent No.7 :**
Paravanatha Venkata Battananda Swamy,
S/o. Late Jagannadha Swamy, 55 years,
Kanchara Veedhi, Visakhapatnam.

Please take notice that the above named appellats has instituted the above appeal against you and the above appeal stands posted on **28-10-2019** for your appearance. Therefore you are hereby called upon to appear either in person or through a duly instructed counsel, before the Hon'ble Court on **28-10-2019 by 10:30 A.M.,** failing which the above appeal will be decided in your absence as ex-parte.

**(By Order of the Hon'ble Court)**

**S.V.RAMANA**
Advocate for Appellants
Visakhapatnam.
**Cell: 8501057554**

## నేడు కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవం

భీమునిపట్నం: స్థానిక చిన్నబజార్ లోఉన్న కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవం ఆదివారం సాయత్రం జరుగుతుందని ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్గా ఎస్.రంగారెడ్డి డిప్యూటీ కమీషనర్ అఫ్ పోలీస్ లా అండ్ ఆర్డర్ జోన్ 1 విశాఖ సిటీ, అలాగే కె.వి. మహాలక్ష్మి, పదకొండవ అడిషనల్ జిల్లా జడ్జ్ గుడివాడ పాల్గొంటారని చెప్పారు.

## సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ



భీమునిపట్నం: ఈనెల 9,10 తేదీలలో అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన డ్రాయింగ్, ఎలక్యూషన్ పోటిలలో సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి విద్యార్థులకు బహు మతులు వచ్చాయని ప్రిన్సిపాల్ సిస్టర్ సీనా తెలిపారు. స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ అవంతిలో జరిగిన వివిద పోటీల్లో పది మంది పాల్గొనగా ఆరుగురు విద్యార్థులకు బహుమతులు వచ్చాయని తెలిపారు. డ్రాయింగ్ పోటీలలో 7వతరగతి చదువు తున్న డి.సాయి మాధుర్య కి ప్రదమ స్థానం, కె.శృతిలయకి రెండవ బహుమతి, అలాగే నాల్గవ తరగతి చదువు తున్న అభినయకి మొదటి బహుమతి లభించాయి. డిబేట్ కాంపిటీషన్లో మొదటి బహుమతి 7వ తరగతి చదువుతున్న కె.గాయత్రి గణేష్కి, మూడవ బహుమతి కె.శృతిలయలకు అలాగే ఆరవ తరగతి విద్యార్థిని డి సుప్రియ మొదటి బహుమతి వచ్చినట్లు చెప్పారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను సిస్టర్ సీనా అభినందించారు.

# ప్రమాద స్థాయిలో రైవాడ నీటిమట్టం

- జలాశయంలోకి వరద నీటి ప్రవాహం
- నేడో, రేపో నీరు విడుదలకు అవకాశం



దేవరాపల్లి : రైవాడ జలాశయం లో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకుంది. ఎగువ కురుస్తున్న భారీ వర్షాలతో పెద్ద ఎత్తున వరద నీరు జలాశయం లోకి వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 113.05 మీటర్లకు చేరుకుంది. ఇదిలా ఉండగా జలాశయం లోకి 1463 క్యూసెక్కుల వరద నీరు వచ్చి పడుతుంది. ఇదే స్థాయిలో ఇన్ ఫ్లో కొనసాగితే నేడో, రేపో దిగువకు వరదనీటిని విడుదల చేయవచ్చునని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. నీటిమట్టం మరో 45 మీటర్లు చేరు కొంటే వరద గేట్లు ఎత్తే విషయమై జిల్లా అధికారులతో చేర్చించి నట్లు ఇరిగేషన్ డీఈ మాధవి, ఎఈలు కార్తీక్, గణపతిరావు తెలిపారు.

### చోడవరంలో ఈనెల 14 నుంచి

## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14,17 క్రీడా ఎంపికలు

చోడవరం : చోడవరం మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 14 నుంచి 15, 16 తేదీలలో మూడు రోజులపాటు అండర్ 14, 17 విభాగాలలో క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు లక్కవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు అప్పలనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖోఖో, వాలీబాల్ కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక జరుగుతుందన్నారు.14న వాలీబాల్ ఎంపిక గవరవరం హైస్కూల్, 15న కబడ్డీ ఎంపిక లక్కవరం హైస్కూల్, 16న ఖో,ఖో అథ్లెటిక్స్ చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా ఎంపిక జరుగుతాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని, ఈ ఎంపికలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో జరుగుతాయన్నారు.మరిన్ని వివరాలకు ఎస్.అప్పల నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు, లక్కవరం, 9618638356, 9849570448 మొబైల్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




దేవరాపల్లి : సమాజ శ్రేయస్సుకై ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండడం చాలా ముఖ్యమని మండల సమాచార ఐక్యవేదిక అధ్యక్షులు కె.వి రమణ అన్నారు. శనివారం సమాచార హక్కు చట్టం దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని స్థానిక ద్రోణంరాజు సత్యనారాయణ మూర్తి ఆడిటోరియంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కె.వి రమణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం సంబంధించి ఎక్కడ ఎటువంటి బోర్డు లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు ఎక్కడైతే హక్కు చట్టాన్ని గౌరవిస్తారు అక్కడ ఆ కార్యాలయం పారదర్శకతతో అధికారులు పని చేస్తున్నారని చెప్పడానికి ఇది ఒక చక్కటి నిదర్శనం అన్నారు. అందువలన ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం బోర్డు తప్పనిసరిగా పెట్టాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి చిన్న కన్నబాబు మాస్టర్ మండల యాదవ సంఘం అధ్యక్షులు కిలాన శ్రీనివాసరావు, మొల్లి కృష్ణమూర్తి, జి కొండలరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డా.బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలకు అందరూ కృషి చేయాలి

- కార్యక్రమంలో పాల్గొన్న దళిత నాయకులు ఇండుగబల్లి నూకరాజు, పలివెల సతీష్

### - సరమర్ల మధుబాబు



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు నందు ఉన్న డాక్టర్ బి ఆర్.అంబేద్కర్ మరియు బాబూ జగజ్జీవన రామ్ విగ్రహావిష్కరణ మహోత్సవములలో భాగంగా శనివారం అన్నవరం స్థానిక దళిత నాయకులు మరియు గ్రామ ప్రముఖుల విగ్రహాలకు పూల మాలలు వేసారు.ఈ సందర్భంగా దళిత నాయకుడు సరమర్ల.మధుబాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు దళిత జాతి ఐక్యతను చాటాలని అంబేద్కర్ పొందిపరిచిన ఆశయసాధనకై అందరూ అంబేద్కర్ చూపిన బాటలో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు సేరు. వీరభద్రావు, పదిలం. బెన్నబాబు, నాయకులు పలివెల సతీష్,ఇండుగుబల్లి. నూకరాజు, గణేశుల.బాబ్జి, తాడి.సింహాచలం, బండారు. రాంబాబు, తాటిపాక. సింహాచలం, అంబేద్కర్ మరియు బాబూ జగజ్జీవన రామ్ యూవజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి

### నష్టపరిహారం చెల్లించాలని రైతు ఆవేదన

అరకులోయః అరకులోయ మండలం చోంపి పంచాయతీ చోంపి గ్రామ రైతు అనగా పద్మనాయికి సీమకు చెందిన రెండు దుక్కిడేట్లు కురిసిన బారి వర్షంలో పిడుగుపాటుకు గురియ్యి రెండు ఎద్దులు చోంపి అడవిలో మృతి చెందాయి. బుధవారం రాత్రి అడవిలో పిడుగు పడి ఎద్దులు మ ృతి చెందడంతో ఆ రాత్రి ఎవ్వరు గుర్తించలేక పోయరు. మరసటి రోజు గురువారం సాయంత్రం తమ ఎద్దులు రాలేదని యజమాని అడవికి వెళ్ళగా తమ ఎద్దులు చని పోయి ఉండడంతో పిడుగుపాటుకు మృతి చేందయని తెలుసుకొని ఆవేదనతో గ్రామస్థులను తెలియజేసి ప్రభుత్వమే తన కుటుంబానికి ఆర్థికంగా ఆదుకోవాలని ఆవేదన చెందుతున్నారు.

# భగత్‌సింగ్ నగర్ ఆడియో విడుదల

విశాఖపట్నం : అన్ని వర్గాల ప్రేక్షకులకు ఆకట్టుకునే విధంగా భగత్‌సింగ్ నగర్ పాటలు ఉన్నాయని, ఈ చిత్రం పెద్ద హిట్టవుతుందని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖామంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గ్రేటర్ ఇండియా మీడియా హౌస్ సమర్పణలో రమేష్ ఉడత్తు, వాలాజా గౌరి నిర్మిస్తున్న భగత్‌సింగ్ నగర్ చిత్ర ఆడియో విడుదల శనివారం సాయంత్రం స్థానిక వి.ఎం.ఆర్.డి.ఎ. చిల్డ్రన్ ఎరీనాలో పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆడియోను విడుదల చేసి తొలి సిడిని చిత్ర నిర్మాత దర్శక నిర్మాతలకు అందించారు. అనంతరం మంత్రి ముత్తంశెట్టి మాట్లాడుతూ భగత్‌సింగ్ నగర్ చిత్ర టైటిల్ ఎంతో పవర్‌ఫుల్‌గా ఉందని, పాటలన్నీ ఆకట్టుకునేలా ఉన్నాయన్నారు. ఈ చిత్రం తప్పకుండా విజయవంతం అవుతుందని ఆశిస్తున్నామన్నారు. సినీ నిర్మాత, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సినీ పరిశ్రమ అభివృద్ధికి విశాఖ వేదిక కానుందన్నారు. భగత్‌సింగ్ నగర్ టైటిల్ చిత్ర విజయ సంకేతానికి మారుపేరుగా ఉందన్నారు. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరారు. చిత్ర దర్శకుడు క్రాంతి వాలాజ, నిర్మాత రమేష్ ఉడత్తు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో జరిగే ప్రేమ, థ్రిల్లర్, క్రైం మూడు అంశాలతో కూడిన కథ భగత్‌సింగ్ నగర్ అని అన్నారు. ఈ చిత్రం ప్రేక్షకులకు ఆకట్టుకుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్కూల్ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం




దేవరాపల్లి : మండలంలోని ముసిడిపల్లి శివా యుపి స్కూల్‌కి చెందిన బస్సు శనివారం 30 మంది విద్యార్థిని విద్యార్థులకు కాశీపురం నుండి ఆనందపురం వెళ్లే రోడ్డులో ప్రమాదవశాత్తు బండి అదుపు తప్ప డంతో పక్కవారి పొలాల్లోకి వెళ్ళిపోయింది బస్సులో ఉన్న విద్యార్థిని విద్యార్థులు పెద్ద పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఏది ఏమైనప్పటి సక్రమమైన అయినటువంటి రోడ్డు మార్గాలు కాకపోవడం చేత నే తరచూ ప్రయాణికులు నానా అవస్థలు పడుతూ ప్రయాణం చేయవలసి వస్తుందని ప్రయా ణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వృద్ధుల సమస్యలు పరిష్కారం కావడం లేదు



అనకాపల్లి : వృద్ధులకు గుర్తింపు కార్డులు ఇవ్వడమే తప్ప వాటి ఉపయోగం ఎక్కడా కనబడడం లేదని గ్రామీణ వయోవ ృద్ధుల ప్రజా సంక్షేమ సంఘ వ్యవస్థాపకులు కాండ్రేగుల అప్పారావు పేర్కొన్నారు. ఈ మేరకు డిజేబుల్డ్ వెల్ఫేర్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు కు శనివారం వినతిపత్రాని అందజేశారు. బస్సుల్లో రాయితీలకు కార్డుల ఉపయోగం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఏ పథకమూ తమకు అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఈ నెల 14న సత్యదేవుని హుండీలు లెక్కింపు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీల లెక్కింపు ఈ నెల14వ తేదీన ఉదయం 7-30 ని.లకు లెక్కించుటకు సదరు సొమ్మును బ్యాంకులో జమ చేయుటకు కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు మేరకు యావన్మంది భక్తులకు, గ్రామ ప్రజలకు తెలియజేయడమైనది.

## స్వచ్ఛబ్రాండిక్స్ కార్యక్రమం



చ్యుతాపురం : బ్రాండిక్స్ భారత బాగస్వామి దొరస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ్ బ్రాండిక్స్ కార్యక్రమంలో భాగంగా శనివారం హౌస్ కీపింగ్ స్టాఫ్ తో పాటు కొంత మంది ఉద్యోగులు బ్రాండిక్స్ మెయిన్ గేట్ నుండి చెత్తా చెదారంతో పాటు పిచ్చి మొక్కలను తొలగించారు.

## ముస్లిం తాటిచెట్లపాలెంలో మహిళల్లో వచ్చే కాన్సర్ పై అవగాహనా శిక్షణా కార్యక్రమం

విశాఖపట్నం : ముస్లిం తాటిచెట్లపాలెం లో శనివారం మహిళల్లో వచ్చే కాన్సర్ పైన పి.మాధురి, ఎం.డి, గైనిక్ మహిళలకు అవగాహన కల్పించారు. కైలాసగిరి కలంజియ సమాఖ్య సిబ్బంది పర్యవేక్షణలో జరిగింది. మహిళల్లో కాన్సర్ పైన వున్న అపోహలను తొలగించడానికి పవేర్ పాయింటు ప్రెజెంటేషన్ ద్వారా వివిరించారు. రొమ్ములో ముద్ద, రొమ్ము ఆకారంలో మార్పు, చర్మం మసకబారడం, చనుమొన నుండి వచ్చే ద్రవం, కొత్తగా విలోమ చనుమొన, చర్మం యొక్క ఎర్రటి పొలుసుల పాచ్ రొమ్ము క్యాన్సర్ యొక్క మొట్టమొదటి గుర్తించదగిన లక్షణం సాధారణంగా రొమ్ము కణజాలం నుండి భిన్నంగా భావించే ముద్ద. స్త్రీ ముద్దగా భావించినప్పుడు 80% కంటే ఎక్కువ రొమ్ము క్యాన్సర్ కేసులు కనుగొనబడతాయి. మొట్టమొదటి రొమ్ము క్యాన్సర్లు మామోగ్రామ్ ద్వారా కనుగొనబడతాయి. చంకలలో ఉన్న శోషరస కణుపులలో కనిపించే ముద్దలు రొమ్ము క్యాన్సర్‌ను కూడా సూచిస్తాయి. దీనితో అండాశయ ముఖద్వారం కాన్సర్ గురించి వివరించారు. గర్భాశయ కాన్సర్ తో బాధపడే స్త్రీలకూ అసాధారణ రక్తస్రావం ఉంటుంది. అది ఆ నెలలో ఎక్కువ, తక్కువలుగా ఉంటుంది. ఎక్కువ వైట్ డిశ్చార్జ్ కావడం, గర్భాశయ కాన్సర్ మరో లక్షణం వేజైనల్ డిశ్చార్జ్ అధికమవ్వడం. ఇది కూడా మహిళకి మహిళకి తేడా ఉంటుంది, దుర్వాసనతో, చిక్కగా, శ్లేష్మంగా ఉంటుంది. ప్రతిసారీ మీరు మీ గైనకాలజిస్ట్ ని సంప్రదించి మీ అసాధారణ వైట్ డిశ్చార్జ్ గురించి చెప్పాలి. ముందుగా లక్షణాలు తెలుసుకోవడం ద్వారా దాదాపుగా అన్ని రకాల కాన్సర్ లను నివారించవచ్చు అని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో క్లస్టర్ నాయకులు లక్ష్మి, ఫాతిమా, దౌలత్, మిగిలిన సభ్యులు సిబ్బంది అరుణ,వేంకట లక్ష్మి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

# అక్టోబర్ 30 వరకు పొడిగింపు

### మండల వ్యవసాయశాఖ అధికారిణి ద్వారకాదేవి



పెద్దాపురం : రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అర్హత కలిగి పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా దరఖాస్తులను అందజేయడానికి అక్టోబర్ 30 వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం గడువు పొడిగింపు చేసిందని మండల వ్యవసాయ అధికారిణి ద్వారకదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న రైతు భరోసా పథకానికి అర్హత పొందిన రైతుల జాబితాను మండలంలోని ప్రతీ పంచాయతీ కార్యాలయంలో ప్రచురించడం జరిగిందని తెలిపారు. అర్హత ఉండి పూర్తి స్థాయిలో దరఖాస్తులు లేని రైతుల పేర్లను పెండింగ్‌లో ఉంచడం జరిగిందని తెలిపారు. ప్రజా సాధికారిక సర్వేలో పేరు నమోదు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, తదితర దరఖాస్తులను అందజేయలేని కారణంగా కొంతమంది రైతుల పేర్లను పెండింగ్ లో ఉంచడం జరిగిందని తెలిపారు. సంపూర్ణమైన దరఖాస్తు లను అగ్రికల్చర్ ఏఓ కార్యా లయంలో గాని, సంబంధిత వీఆర్వోలకు గాని ఈనెల 30వ తేదీ లోపు అందజేయాలి ఆమె తెలిపారు. అలాగే కౌలురైతు సాగుదారు హక్కు పత్రం (సిసిఆర్సి కార్డు)కు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత గ్రామ విఆర్వోలకు అందజేయాలని ఆమె కోరారు.

## బ్యాంకు లింక్ పెండింగ్ రుణాలు విడుదల చేయాలి

### ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి వినతి



కాకినాడ : 2018-19 నాటి బ్యాంకు లింక్ పెండింగ్ రుణాలు విడుదల చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో ఎస్సీ కార్పోరేషన్ ఇడి సునీతకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ 2018-19 రుణాలను ప్రభుత్వంరద్దు చేసిందని దీనివలన లబ్ధిదారులు నష్టపోతున్నారని పెండింగ్‌లో ఉన్న నాన్ బ్యాంకింగ్ రుణాలు ఎన్ఎస్ఎఫ్‌డిసీ, ఎన్ఎస్ఎఫ్‌కెడిసి రుణాలు ఇవ్వాలని అలాగే డాక్యుమెంటేషన్ పూర్తిఅయ్యి నిధుల కొరతతో ఆగిన యూనిట్‌లు వెంటనే విడుదల చేయాలని కోరారు.ఇప్పటికే ఆన్‌లైన్ చేయించుకొని బ్యాంకుల్లో రూ40 నుండి 50 వేల వరకు డిపాజిట్ చేసిన లబ్ధిదారుల పెండింగ్ రుణాలు విడుదల చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మోర్త రాజశేఖర్, జిల్లా కన్వీనర్ పచ్చిమాల వసంత కుమార్, కెవిపిఎస్ జిల్లా నాయకులు సత్యా నందం, సురేష్, పి.కృష్ణ, విపర్తి శ్రీను, శ్రీనివాస్, ఎన్.రాజు,మచ్చాశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ జిల్లాలో ఏపీయూడబ్ల్యూజేకి గట్టి షాక్

- ఏపీయూడబ్ల్యూజేకు రాజీనామా చేసిన 30 మంది విలేకరులు
- మనుగడ కాపాడుకునే ప్రయత్నంలో యూనియన్ నాయకులు



నర్సీపట్నం : విలేకరుల సంక్షేమానికి కాకుండా వ్యక్తి పూజ కే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల తాము యూనియన్ నుంచి బయటకు వచ్చామని రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ఏపీయూడబ్ల్యూజే పదవులు నిర్వహించిన ఆంధ్రభూమి విలేఖరి రామకృష్ణ తెలియజేశారు. కేవలం వారి బాగోగులు మాత్రమే చూసుకోవడంలో నాయకులు నిమగ్నమయ్యారన్నారు. విలేకరుల సంక్షేమం కోసం తాము అనేక పర్యాయాలు చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. వీరి నిర్లక్ష్య ధోరణి వల్లే గతంలో యఫ్ యూనియన్ ఏర్పడిందన్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత అదే మరో రూపం దాల్చింది అన్నారు .కళ్ళు తెరవకపోతే తమ యూనియన్ మాత్రం ప్రత్యామ్నాయ యూనియన్గా ఉంటుందని ఆయన అన్నారు. మేమే మార్గదర్శిగా ఉంటా మని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లంక శివ కుమార్, మెడికల్ షాప్ రమణ, టీవీ9 ఏసుబాబు,ఐ న్యూస్ మురళి, సివిఆర్ న్యూస్ ఇన్చార్జి బీజారామ్ కుమార్, విశాలాంధ్ర విలేఖరి శంకర్, ఇతర మండల విలేకరులు పాల్గొన్నారు.

## సమాచారహక్కు చట్టం దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు



భీమునిపట్నం: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం తెలుగుదేశం పార్టీ భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 అక్టోబర్ 12 వ తేదీన కేంద్రప్రభుత్వం అమలు చేసిందని, సామాన్యుడికి ప్రభుత్వంకి సంబంధించిన ఏ సమాచారంనైనా పొందవచ్చని, దరఖాస్తు చేసుకున్న 30 రోజు లలోగా సమాచారం ఇవ్వాలని గంటా నూకరాజు తెలియజేశారు. ఈ చట్టంలో సెక్షన్ 2జె ప్రకారం పాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారీ తనం కోసం కేంద్రప్రభుత్వం ఈ చట్టాన్ని అమలులోకి తెచ్చిందని. ప్రభుత్వ పథకాలు,అభివృద్ధి పనుల పురోగతి తదితర అంశాలపై సామాన్యుడు ప్రశ్నించేలా చట్టాన్ని రూపుదిద్దారని, ఇది అమలులోకి వచ్చి 14 సంవత్సరాలు గడిచినా ఇప్పటికి ప్రజల్లో దీనిపై స్పష్టమైన అవగాహన కన్పించడం లేదని, ఇప్పటి వరకు సమాచార హక్కు కమీషన్ వద్ద సుమారుగా 23,500లకు పైగా ఫిర్యాదులు పెండింగులో ఉన్నాయని అన్నారు. వయసుతో సంబంధం లేకుండా 18 ఏళ్ళు నిండిన వారంతా ఈ చట్టం ద్వారా తమకు కావలసిన సమాచారం కోరుతూ సంబంధిత కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని. ఎందుకు వివరాలు అడుగుతున్నారని కారణాలు ఎవరికీ ఏ రూపంలోనైనా చెప్పనవసరం లేదని గంటా నూకరాజు చెప్పారు. సేకరించిన సమాచారం పంపించేందుకు దరఖాస్తు దారుని పేరు చిరునామా, ఫోన్ నెంబర్ ఇవ్వవలసివస్తుందని, ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో సెక్షన్ 5 (1) మేరకు ప్రజా సమాచారం అధికారి, సహాయ సమాచార అధికారి ఉంటారని, దరఖాస్తును ప్రజా సమాచార అధికారికి ఇవ్వవలసి వస్తుందని. దరఖాస్తు కోసం ప్రత్యేక నమూనా అంటూ ఏమి లేదని తెల్ల కాగితం మీద కూడా రాసి ఇస్తే సరిపోతుందని చెప్పారు. తెల్ల రేషన్ కార్డుతో సమాచారం ఉచితంగా పొందవచ్చని, గ్రామ స్థాయిలో సమాచారంకి ఎటువంటి రుసుము అవసరంలేదని, మండల స్థాయిలో 5 రూపాయలు, జిల్లా స్థాయిలో 10 రూపాయలు స్టాంపుల రూపంలో చెల్లించవలసి వస్తుందని. గంటా నూకరాజు తెలియజేశారు. సెక్షన్ 18 (ఏ) ప్రకారం దరఖాస్తు నిరాకరించిన. రుసుం ఎక్కువ డిగినా, తప్పుడు సమాచారం ఇచ్చిన, అసంపూర్తి సమాచారం ఇచ్చినా అటు వంటి అధికారి మీద ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు కమీషనర్ కి పిర్యాదు చేయ వచ్చని గంటా నూకరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయ కులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవకుమార్, కంచెర్ల కామేష్, కె.ఎస్.ఆర్. కృష్ణారావు మాస్టర్, సత్తరపు శివ, రాజగిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

## త్రాగు నీరు అందిస్తున్నారా లేక వర్షపు నీరు అందిస్తున్నారా?



అనకాపల్లి : పట్టణంలో గత కొద్ది రోజులుగా ప్రజలకు అందిస్తున్న త్రాగు నీరు అత్యంత దారుణంగా ఉన్నాయని అది త్రాగు నీరా లేక వర్షపు నీరా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది అని జై అనకాపల్లి సేన అధ్యక్షుడు కొణతాల సీతారాం విమర్శించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జివిఎంసి సరఫరా చేస్తున్న నీరు తాగితే అనారోగ్యా ల భారిన పడటం ఖాయమన్నారు. మంచి నీటి కి బదులు ఎర్ర నీరు సరఫరా చేస్తున్న కారణం గా ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారు గత్యంతరం లేక ఈ నీటినే తాగాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు అని వాపోయారు.

ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. శుద్దమైన త్రాగు నీరు సరఫరా చేయాలని అధికారులను ఎన్నిసార్లు కోరినా జివిఎంసి అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

ప్రజా హిత, ప్రజా సంక్షేమ పాలన ప్రభుత ధ్యేయ మని పలికే స్థానిక ఎమ్మెల్యే అమర్ ప్రకటనలు కేవలం ప్రకటనల కే పరిమితి అయ్యాయని విమర్శించారు. ప్రచార ఆర్భాట ల కు చూపిస్తున్న శ్రద్ధ ప్రజ ల ఆరోగ్య పరిస్థితి ల పై ఎమ్మెల్యే అమర్ శ్రద్ధ చూపించాలని తక్షణమే ప్రజలకు శుద్ధమైన త్రాగు నీరు అందించే ల చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో జివిఎంసి కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని సీతారాం హెచ్చరించారు.

## వాడపల్లి వెంకన్న ఆలయాన్ని అభివృద్ధికి కృషి చేస్తా

- రాష్ట్ర పియుసి అధ్యక్షులు, శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి
- ఆలయ ప్రాకార పనులకు శంకుస్థాపన చేసిన కలెక్టర్ మురళీధర్‌రెడ్డి



రావులపాలెం : భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా కోనసీమ తిరుపతిగా విరాజిల్లుతూ వరాల నొసంగె కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మురళీధర్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. శనివారం రాష్ట్ర పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కోనసీమ తిరుపతి వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాకార మండపం పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ముదునూరి సత్యనారాయణ రాజు, అధికారులు, అర్చకులు కలెక్టర్ మురళీధర్ రెడ్డి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి లకు వేదం మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆత్రేయపురం మండలంలో వాడపల్లి గ్రామంలో కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి వెంకటేశ్వర స్వామి ఆలయం నేడు రాష్ట్రవ్యాప్తంగానే కాక ఇతర రాష్ట్రాల్లో సైతం పేరుగాంచిందని, స్వామివారిని కొలిచేందుకు నిత్యం వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాలనుండి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని స్వామి ఆశీస్సులు పొందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయం చుట్టూ రూ.3.75 లక్షల రూపాయలతో ప్రాకార మండపం నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రాంగణ నిర్మాణ పనులు పారదర్శకంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్ర పి యు సి చైర్మన్ జగ్గిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో హిందూ దేవాలయాలు అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారని, ఆలయ అభివృద్దే ద్యేయంగా భక్తుల కోరిక మేరకు ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యానికి లోనుకాకుండా ఆలయ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. రావులపాలెం సిఐ వి. కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై హెచ్ శాస్త్రి, రావులపాలెం ఎస్సై పి. బుజ్జి బాబు, తన సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పి ఎస్ రాజు, బాబీ రాజు, బాబురావు, కప్పల శ్రీధర్, కోట చెల్లయ్య, మార్గాన్ని గంగాధర్, ఎమ్మార్వో రామకృష్ణ,ఎంపీడీవో నాతి బుజ్జి, మరియు అధికారులు కార్యకర్తలు, భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత




భీమునిపట్నం : వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు సంద ర్భంగా ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్ లో వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందు కున్నారనీ బిజిఎం ఇంగ్లీష్ మీడియం యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ విశాఖ, జ్యులాజికల్ పార్కులో నిర్వహించిన వివిధ పోటీలలో 16 పాఠశాలల నుండి, 4 జూనియర్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగాబిజిఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి అత్యంత ప్రతోభ కనబరిచారనీ తెలిపారు. ద్వితీయ స్థానం గెలుపొందిన విద్యార్థులు వ్యాసరచన 3వతరగతి చదువుతున్న పి.వాగ్దేవి, డిబేట్,క్విజ్ పోటీలలో 10వతరగతి చదువుతున్న ఎస్.దివ్య, 9వ తరగతి చదువుతున్న డి.వర్షిణి, ఎస్.కె అహమ్మద్, జి.లావణ్య, లఘునాటిక లో డి.వర్షిణి,వాగ్దేవి, ఆర్.భాను ప్రకాష్, లావణ్య, సంజన, డ్రాయింగ్ పోటీలలో ప్రథమ, ద్వితీయ పోటీలలో, జూనియర్ క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తెంశెట్టి శ్రీనివాసరావు చేతులమీదుగా బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా బిజెఎం స్కూల్ యాజమాన్యం నకం లభించిన ప్రధమబహుమతి పాఠశాల యాజమాన్య ప్రతినిధి పి.ఎస్.చంద్ తీసుకున్నారు.



శనివారం ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో జరిగిన భగత్ సింగ్ నగర్ ఆడియో ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, విశాఖ వైకాపా పశ్చిమ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ విజయ ప్రసాద్ మళ్ళ



విశాఖ పశ్చిమ నియోజకవర్గం 36, 41 వార్డులో రోడ్లు మరియు కాలువలు, శ్మశానవాటిక ఆధునీకరణ మొదలగు కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ మరియు అధికారులతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయ ప్రసాద్ మళ్ళ ఎక్స్ ఎమ్మెల్యే విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్ ఛార్జ్.

# అమ్మ ఒడి ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం చేయాలి:ఏపీటీఎఫ్ డిమాండ్



కాకినాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం కాకినాడ ఎన్జీఓ హోంలో జిల్లా విద్యా సదస్సు జరిగింది.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ ఉపాధ్యా యులపై బోధనేతర పనుల ఒత్తిడి, బోధనా విధానాలు నిరుత్సాహానికి గురిచేస్తు న్నాయని, ఫలితంగా ఉపాధ్యాయ వృత్తికి భద్రత లోపించి, పాఠశాల విద్యార్థుల సంఖ్యతో ఆధారపడి వందల పాఠశాలలు మూసివేతకు గురై వేలపోస్టులు రద్దుకు కారణమవుతున్నా యన్నారు. విద్యా సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకం ప్రయివేటు పాఠశాలలకు కూడా వర్తింపజేస్తే ప్రభుత్వ విద్య ప్రసనార్ధకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వశిక్ష అభియాన్ జిల్లా ప్రాజెక్టు అధికారి బి.విజయభాస్కర్ మాట్లాడుతూ తరగతి గదిలో సరళంగా బోధన జరగాలని, ఉపాధ్యాయులు నిరంతరం అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పాండురంగారావు, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ కె. సుబ్బారావు తదితరులు ప్రసంగించగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.ఫిలిప్ రాజు సభకు అధ్యక్షత వహించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ఎస్.సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలి

## - అడిషనల్ ఎస్.పి. శ్రీధర్



కాకినాడ: సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని తూర్పు గోదావరి జిల్లా అడిషనల్ ఎస్.పి ఎస్.వి.శ్రీధర్ రావు సూచించారు. సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో సమాచార హక్కు వార్షికోత్సవాల సందర్భంగా కాకినాడ లోని నాగమల్లితోట జంక్షన్ నుండి భానుగుడి వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో అడిషనల్ ఎస్.పి. ఎస్.వి.శ్రీధర్ రావు జెండా ఊపారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్.పి. శ్రీధర్ రావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలందరికీ సమాచారం తెల్సుకునే అవకాశం వచ్చిందని, ఈ చట్టం ద్వారా ప్రతీ పౌరుడు వివిధ పథకాల, కార్యక్రమాల సమాచారం తెల్సుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా పనుల పారదర్శకతను, అవినీతి నిర్మూలనకు ఆస్కారం లభించిందని, అదే విధంగా పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించిన సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సతీష్, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు పి.ఆదినారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒమ్మిరఘురామ్, జిల్లా మహిళా కన్వీనర్ కె.వరలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు అద్దంకి వెంకన్నబాబు, రాష్ట్ర నాయకులు ఎ.ఎన్.మూర్తి, జిల్లా కార్యదర్శి జ్యోతులు నాగేశ్వరరావు, జిల్లా మహిళా కన్వీనర్ శ్రీదేవీ, కుమారి, భవాని,,కాకినాడ నగర కమిటీ అధ్యక్షులు మల్లాడి రాజు, సిటీ ప్రధాన కార్యదర్శి అట్ల సత్యన్నారాయణ, కోశాధికారి కర్రి ధర్మరాజు, సిటీ ఉపాధ్యక్షులు కలదిండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బదరీనాథుని దివ్యసన్నిధిలో సాయంసంధ్యలో

# చైతన్యసోదరుల కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ



విశాఖపట్నం: భారతదేశానికి ఉత్తరాన హిమాలయ పర్వత సమీపంలో వెలసిన ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు కేదారనాధ్ మరియు బదరీనాథ దేవాలయాలు. ఇవి రెండు భక్తిభావశోభితములై భగవంతుని నిలయాలగా విరాజిలులతున్నాయి. జగత్ గురువులు శ్రీ ఆది శంకరాచార్య స్వామి కేరళలో జన్మించి వేదమంత్రోచ్చారణము చేసి ధర్మ ప్రచారము చేసిన కారణజన్ములు శ్రీ శంకరులు బదరీనాధ్ మరియు కేదారనాధ్ దేవాలయాలలో నిత్యము స్వామి వారికి అర్చనానుష్ఠానములు నిత్యధూప దీపనైవేద్య ములతో ఆరాధించడానికి కేరళలోని నంబూద్రి బ్రహ్మణులను నియమించారు. బదరీనాధ్‌లో శ్రీమన్నారాయణ స్వామిని కేదారనాధ్ లో పరమేశ్వరులను ఈ నంబూద్రి బ్రాహ్మణులే ఇప్పటికీ స్వామి వారికి నిత్య ధూప దీప నైవేద్యములతో అర్చించుచు, దక్షిణాది సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఉన్నారు. ఈ రెండు చోట్ల నియమింపబడిన అర్చకస్వాము లను రావల్స్ అని పిలిచెదరు. వీరు కేరళ నుండి తీసుకురాబడిన నంబూద్రి బ్రాహ్మణులు. వీరు వైదికమతాచారము ననుసరించి సర్వసేవలను ఈ దేవాలయాలలో నిర్వహిస్తు న్నారు. భారతదేశం నలుమూలల నుండి లక్షలమంది భక్తులు ఈ రెండు దేవాలయాలను సందర్శించి పునీతులై పరమ భక్తిభావమును నింపుకొని వెళుతూ ఉంటారు. ఇతర దేశాలనుండి కూడా ఎన్నో వేలమంది ఇక్కడకు వచ్చి స్వాములను దర్శించి తిరిగి వెళుతూ ఉంటారు. విశాఖపట్నంలోని శ్రీకృష్ణ చైతన్య మఠం స్వామిజీ శ్రీశ్రీశ్రీ కేశవమహరాజ్ శ్రీ వారణాసి వేంకటేశ్వర శర్మ మరియు బుక్కపట్నం కృష్ణమాచార్యులను చైతన్య సోదరులుగా నామకరణం చేశారు. వీరు సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి శిష్యులు. వీరు దేశ విదేశాలలో 5000లకు పైగా కచేరీలు చేసి ఎన్నో పురస్కారాలను సన్మానాలను పొందియున్నారు. కంచికామకోటి పీఠం, కాంచీపురం వారిచే వీరు ఆస్థాన విద్వాంసులుగా నియమింపబడ్డారు. సెప్టెంబర్ 19న చైతన్య సోదరుల శిష్యబృందం ఆనందంతో తమ జన్మధన్యమైనదని ఇటువంటి అవకాశం లభించడం తమ పూర్వజన్మ సుకృతమని భావించి తారకేశ్వర్ ఫౌండేషన్ శ్రీ ప్రభుదాస్ స్వామీజీని ప్రశంసించి వారికి ఎప్పుడూ ఋణపడి ఉంటామని తెలియజేసి స్వస్థానమైన విశాఖపట్నమునకు బయలుదేరారు. ఈ కార్యక్రమము శ్రీ బదరీనాధ్ దేవాలయము మరియు శ్రీ తారకేశ్వర ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో జరిగింది. ఇంతకుముందు కూడా 2017లో పారుపల్లి సత్యనారాయణ వారి శిష్యబృందము బదరీనాధ్ వచ్చి సంగీత కచేరీ చేశారు.

# సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఆయుధం

## సమాచార శాఖ ఉప సంచాలకుకు ఫ్రాన్సిస్

కాకినాడ : సమాచార హక్కు చట్టం-2005 ద్వారా సమాచారం తెలుసుకొనే హక్కు ప్రతీ పౌరుడు కలిగి ఉన్నాడని , అవినీతి నిర్మూలనకు ఈ చట్టం ఒక ఆయుధంలా పని చేస్తుందని సమాచారశాఖ ఉపసంచాలకులు ఎం.ఫ్రాన్సిస్ అన్నారు.ఫోరంఫర్ ఆర్టీఐ ఆధ్వర్యంలో శనివారం కాకినాడబాలాజీ చెర్వు సెంటర్‌లోని డ్రైవర్స్ అసోసియేషన్ హాలులో జరిగినజిల్లా స్థాయి సమావేశంలో డిడి.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ సమాచారాన్ని తెలుసుకొనే హక్కు ప్రజలకు ఇవ్వడంతో పాటు సమాచారాన్ని తెలుపవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.ఈ చట్టం సద్వినియోగం చేసుకొని ప్రజల సమస్యల పరిష్కారం,నాణ్యత కలిగిన పనులు పొందడం ,నిర్ణీత కాలంలో పనులు పూర్తి చేయడం వంటి ప్రయోజనాలకు నాంది పలికిందన్నారు.

ఆర్‌టిఐ కార్యకర్తలు ఈ చట్టాన్ని పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడానికి కృషి చేయాలన్నారు.

ఈచట్టం ద్వారా వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో అమలు చేసే పనులు , విధులు, ఉద్యోగుల వివరాలు వంటి సమాచారాన్ని ప్రతీ కార్యలయ నోటీసు బోర్డులో ప్రచురించాలన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్తిపాటి చంద్రమోహన్ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు కె.హనుమంతరావులు మాట్లాడుతూ అపరిష్కృత సమస్యలు పరిష్కరించుటకు సమాచారహక్కు చట్టం దోహదపడుతుందన్నారు. ఈసందర్భంగా హనుమంతరావు ఆలపించిన గేయాలు కార్యకర్తలను ఉత్సాహ పరిచచాయి.

అనంతరం జిల్లా కమిటఅఃఈనిఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ఎం.వి.వి.సుబ్బారావు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బయ్యా రాజేంద్రకుమార్,జాతీయ మహిళా అధ్యక్షురాలు కె.లలితాదేవి,న్యాయవాద యోగ అధ్యక్షులు జే.శాంతకుమారి, పలుమండంల ,గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో అంతర్జాతీయ విద్యార్థి సమ్మేళనం



సాగర్‌నగర్: భారత ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ "స్టడీ ఇండియా " కార్యక్రమంలో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, సైన్స్, నర్సింగ్, మేనేజ్‌మెంట్, ఆర్కిటెక్చర్ కోర్సులలో ప్రవేశం పొందిన వివిధ దేశాలకు చెందిన విద్యార్థుల అంతర్జాతీయ విద్యార్థి సమ్మేళనాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ మాట్లాడుతూ స్టడీ ఇండియా కార్యక్రమం ద్వారా వివిధ దేశాలలో భారత ప్రభుత్వం చేపట్టిన ప్రచార కార్యక్రమాలకు స్పందిస్తూ విదేశీ విద్యార్థులు గీతంను ఎంపిక చేసుకోవడం విశ్వవిద్యాలయంపై బాధ్యతను పెంచుతోందన్నారు. గీతం నిర్వహిస్తున్న కోర్సులను అంతర్జాతీయంగా పేరుపొందిన విశ్వవిద్యాలయాలు ఇప్పటికే తమకు సమానమైన స్థాయి గలవిగా గుర్తించాయని తెలిపారు. విదేశీ విద్యాలయాలతో కలిసి పనిచేయడంతో పాటు దేశంలోని పరిశోధనా సంస్థల సహకారంతో పలు రీసెర్చి ప్రాజెక్టులను నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో మినీఇండియాగా వ్యవహరిస్తున్న గీతం విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల రాక కొత్త ఒరవడిని సృష్టించగలదన్నారు. విదేశీ విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను గీతంలో కల్పిస్తామన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ మాట్లాడుతూ విదేశీ విద్యార్థుల చేరికతో గీతం అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా సమీప భవిష్యత్‌లో మార్పు చెందబోతోందని పేర్కొన్నారు.

గీతం అంతర్జాతీయ విద్యార్థివ్యవహారాల విభాగం డైరెక్టర్ కె.పి.కిషన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్టడీ ఇండియా కార్యక్రమం ద్వారా వివిధ దేశాలలో గీతంకు సంభందించిన పలు విద్యాకార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. గీతంలో తమ విద్యార్థులను వివిధ కోర్సులలో ప్రవేశానికి పంపడానికి పలు రాయబార కార్యాలయాలు అసక్తి కనబరుస్తున్నాయని వెల్లడించారు.

ఈ అంతర్జాతీయ విద్యార్థి సమ్మేళనంలో భాగంగా అఫ్ఘన్, నేపాల్, బగ్లాదేశ్‌లకు చెందిన విద్యార్థులు పలు సంస్కృతిక ప్రదర్శనులు చేశారు.

# పశ్చిమ బెంగాల్ నేతలకు కీలక సూచనలు చేసిన సోనియా

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ నేతలకు ఆ పార్టీ జాతీయ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీ కీలక సూచనలు చేశారు.

తృణమూల్, బీజేపీని ఓడించడానికి లెఫ్ట్ ఫ్రంట్ నేతలతో కలిసి పనిచేయాలని సోనియా గాంధీ సూచించారు.

కాంగ్రెస్ సీనియర్ నేత, బెంగాల్ ప్రతిపక్ష నేత అబ్దుల్ మన్నన్ సారథ్యంలో ఓ బృందం సోనియా గాంధీతో ఆమె నివాసంలో భేటీ అయ్యారు. బెంగాల్‌లో జరుగుతున్న పరిణామాలు, బెంగాల్ తాజా రాజకీయ పరిస్థితిపై ఆయన సోనియాతో చర్చించారు.

# ట్రస్ట్ ఆసుపత్రిలో విజయవంతంగా అరుదైన శస్త్రచికిత్స

## 12కేజీల బరువైన కణితి తొలగింపు

## డా.సురేంద్రనాధ్‌కు ప్రశంసల జల్లు





కాకినాడ: కాకినాడ రూరల్ సర్పవరం ట్రస్ట్‌ఆసుపత్రిలో డా. సురేంద్రబాబు నేతృత్వంలో అరుదైన శస్త్ర చికిత్స చేసి 12 కేజీల కణితి తొలగించారు.20రోజుల నుండి తీవ్ర మైన కడుపు నొప్పితో బాధ పడుతున్న 70 ఏళ్ల మహిళకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించగా అండాశయం వద్ద పెద్ద కణితి కనిపించింది. దీంతో జనరల్ సర్జన్ డా.బి.సురేంద్రనాధ్ వైద్య బృందం ఆపరేషన్ చేసి కణితిని తొలగించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ ఆసుపత్రి డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన పి.సత్యవతి తీవ్రమైన కడుపు నొప్పితో బాధ పడుతూ తమ ఆసుపత్రిలో చేరారన్నారు. పరీక్షలు నిర్వహించి అండాశయంలో పెద్ద కణితిని గుర్తించడం జరిగిందని డా.సురేంద్రనాధ్ ఆధ్వర్యంలో కణితిని పూర్తిగా తొలగించి నట్టు తెలిపారు.శస్త్ర చికిత్స విభాగంలో అత్యంత అనుభవజ్ఞులైన జనరల్ సర్జన్ డాక్టర్ సురేంద్ర నాధ్ , అనస్తీసియా డా.యు. కిషోర్ కుమార్ తదితరవైద్య బృందం కి ట్రస్ట్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి,ఇతర వైద్యులు అభినందనలు తెలిపారు.

# విశ్వవ్యాప్తం.. గోవింద నామస్మరణం

## సింగపూర్‌లో టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

## మన సంస్కృతిని కాపాడుతున్నందుకు అభినందనలు



తిరుపతి: కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని నేడు విశ్వ వ్యాప్తంగా ఆరాధిస్తున్నారని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడించారు. సింగపూర్‌లో ప్రవాస తెలుగు ప్రజలు నిర్వహిస్తున్న శ్రీనివాస కల్యాణంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శనివారం అక్కడి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఇతర దేశాల్లోని తెలుగు ప్రజలు ఇలాగే శ్రీవారి కల్యాణాలు నిర్వహించాలని అభిలషించారు. దేశం విడిచి వచ్చినా మన సంప్రదాయాలు, సంస్కృతిని మరచిపోకుండా వీధివీధినా శ్రీనివాసుడి ఆలయాలు నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. తిరుమలలో శ్రీవారి కల్యాణాన్ని అందరూ తిలకించలేరు. విదేశాల్లోనూ నిర్వహించి ఆ అనుభూతిని అందరికీ పంచడం ఆనందదాయకమన్నారు. లోక కల్యాణం కోసం, సర్వ జనుల సుఖసంతోషాల కోసం శ్రీనివాస కళ్యాణాలు మరిన్ని దేశాల్లో నిర్వహణకు టీటీడీ కృషి చేస్తుందని వైవీ తెలిపారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మార్గదర్శకాలతో మన దళిత గిరిజన వాడల ప్రజలూ స్వామి ఆశీస్సులు పొందేందుకు ఆలయాలు నిర్మించి కల్యాణాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటిదాకా వీఐపీ, వీవీఐపీ దర్శనాల పేరుతో దళారులు భక్తులను దోచుకున్నారు. దాన్ని అరికట్టేందుకు టీటీడీలో ప్రొటోకాల్, నాన్ ప్రొటోకాల్ దర్శనాలు చేపట్టి సామాన్య భక్తుడు క్యూలో వేచి ఉండే సమయాన్ని 16 గంటల నుంచి ఎనిమిది గంటలకు తీసుకొచ్చినట్లు వివరించారు. సింగపూర్ నుంచి తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆన్‌లైన్ ద్వారా దర్శనాన్ని బుక్ చేసుకోవాలని సూచించారు.

తిరుమల వచ్చే ఎన్ఆర్ఐ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే స్పందిస్తానన్నారు. టీటీడీ ద్వారా ఇంకా మెరుగైన వసతులు కల్పించేందుకు పాలకమండలి కృషి చేస్తున్నట్లు సుబ్బారెడ్డి వివరించారు. వైవీ సతీమణి స్వర్ణలతారెడ్డితోపాటు తుడా ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, సింగపూర్ కమ్యూనికేషన్స్, ఐటీ శాఖ మంత్రి ఈశ్వరన్ పాల్గొన్నారు.

# పిల్లల ఒత్తిడిని తగ్గించడానికి క్రీడలు దోహదపడతాయి

- రాబోయే రోజుల్లో విశాఖపట్నాన్ని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దుతా
- ఎ.పి.టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో వెల్లడించిన
- రాష్ట్ర పర్యాటక మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం : విశాఖపట్నం పర్యాటక రంగంలోనే కాకుండా రాబోయే రోజుల్లో క్రీడల హబ్ గా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వెల్లడించారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో రోటరీ క్లబ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, లూయిస్ ఫిలిప్స్, తదితరమైన వాటి ఆధ్వర్యంలో 12 మరియు 13 తేదీలలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నీస్ ఓపెన్ టోర్నమెంట్ ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల నుండి వచ్చే పర్యాటకులకు విశాఖపట్నంలో స్టార్ హోటల్స్ ఉన్నాయని, పర్యాటక ప్రాంతాలను సందర్శించ వచ్చునని ఆయన జపాన్ డెలిగేట్స్ కు వివరించారు. పిల్లల ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు ఎంతో దోహద పడతాయన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి క్రీడాకారులు ఈ టోర్నమెంటులో పాల్గొంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని చిత్తూరు, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ లు ఏర్పాటు చేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పినట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లాలోని అగనంపూడిలో 150 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ క్రీడలు నిర్వహించే విధంగా స్టేడియంలు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వం క్రీడాకారులను ఆదుకుంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కప్ (ఫుట్ బాల్) ఈ నెల 14,15,16 తేదీల్లో విశాఖపట్నం పోర్టు స్టేడియంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బాలికలకు రైల్వే గ్రౌండ్ లోను, బాలురు కు పోర్టు స్టేడియంలో ఫుట్ బాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడలకు తమవంతు పూర్తి సహాయ, సహకారాలు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్న ఆయా సంస్థలను ఆయన అభినందించారు. విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు ఎం.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమన్నారు. ఇలాంటి క్రీడలు జిల్లాలో మరిన్ని నిర్వహించాలని ఆయన మంత్రిని కోరారు. ఈ క్రీడలు ఏర్పాటు చేసిన కమిటీని ఆయన అభినందించారు. అంతకు ముందు మంత్రి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడలకు సంబంధించిన సావనీర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెట్విస్ సిఇఓ శ్రీనివాసరావు, డిఎస్డిఓ ఎన్. సూర్యారావు, రోటరీక్లబ్ అధ్యక్షులు బాబ్జీ, కార్యదర్శి శర్మ, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు మరియు హనీ గ్రూప్ ఎం.డి. ఓబుల్ రెడ్డి, సన్ రే ఎం.డి. రాజ్ కమల్ రాజబాబు, లూయిస్ ఫిలిప్స్ అధ్యక్షులు కంటిపూడి వెంకటరావు, జపనీస్ చీఫ్ నగొర, వరదారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## హోమ్ గార్డుల జీతాల పెంపు

అమరావతి : సుదీర్ఘ పాదయాత్రలో తాను ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. ఇప్పటికే రికార్డు స్థాయిలో ఉద్యోగాల నియామకం, ఆశా వర్కర్ల జీతాల పెంపు, ట్యాక్సీ, ఆటోలు నడుపుకొనే బడుగు జీవులకు ఆర్థిక సహాయం వంటి ఎన్నెన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ప్రభుత్వం.. తాజాగా హోంగార్డులకు శుభవార్త చెప్పింది. హోంగార్డుల జీతాన్ని రూ. 18 వేల నుంచి 21,300 రూపాయలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారంటూ సీఎం జగన్‌కు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తమకు వేతనాన్ని పెంచారంటూ రాష్ట్ర పోలీసు సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

## ఏయూకు ఇంటర్నేషనలైజేషన్ అవార్డు

- అవార్డులు బాధ్యతలు పెంచుతాయి
- అభినందించిన వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



ఆంధ్ర విశ్వకళాపరిషత్ : ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనలైజేషన్ అవార్డు లభించింది. ఇటీవల ముంబాయిలో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయ రావు అవార్డును స్వీకరించారు. శనివారం ఉదయం వర్సిటీ వీసీని ఆచార్య ధనుంజయ రావు మర్యాద పూర్వకంగా కలసి అవార్డును అందజేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందిస్తున్న విశ్వ విద్యాలయాలకు అందించే ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును ఏయూ సాధించిందని వీసీకి వివరించారు. ఈ అవార్డును ఏఎఫ్ఏఐఆర్ఎస్ సంస్థ అందిచిందన్నారు. ప్రతీ సంవత్సరం ఏఎఫ్ఏఐఆర్ఎస్-ఆస్మా అవార్డులను ప్రధానం చేస్తుందన్నారు. ఇటీవల జరిగిన 3వ అంతర్జాతీయ ఆస్మా వార్షిక సమ్మేళనంలో అవార్డులను ప్రధానం చేయడం జరిగింది. ప్రణాళికాబద్దమైన కోర్సులు, కార్యక్రమాలను నిర్వహిస్తూ అంతర్జాతీయీకరణ దిశగా పయనిస్తున్న విధానాన్ని గుర్తిస్తూ విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు ఈ అవార్డులను ప్రధానం చేయడం జరుగుతుంది. అంతర్జాతీయ విద్యార్థులు, విదేశీ ఆచార్యులు, అంతర్జాతీయ అవగాహంన ఒప్పందాలు, సమన్వయం, స్టూడెంట్స్, ఫ్యాకల్టీ ఎక్సేంజ్ ప్రోగ్రామ్‌లు నిర్వహణ వంటి అంశాలను పరిగణలోనికి తీసుకుని ఈ అవార్డును అందించడం జరిగిందన్నారు.

వర్సిటీకి అవార్డుల లభించడం పట్ల వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అవార్డులు మనపై మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. భవిష్యత్తులో మరింత ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విదేశీ విద్యార్థులు, విదేశీ ఆచార్యులను పెద్దసంఖ్యలో భవిష్యత్తులో ఏయూకు ఆహ్వానించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గుజరాత్ తీర ప్రాంతంలో 5 పాక్ పడవలు స్వాధీనం

### ఉగ్రవాదులు చొరబడి ఉండవచ్చని అనుమానం

గాంధీనగర్: గుజరాత్‌లోని హరమి నుల్లా ఏరియాలోని తీర ప్రాంతంలో ఐదు పాక్ మత్స్యకారుల పడవలను సరిహద్దు భద్రతా సిబ్బంది (బీఎస్ఎఫ్) స్వాధీనం చేసుకుంది. శుక్రవారం రాత్రి 10.45 గంటలకు బీఎస్ఎఫ్ సిబ్బంది ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతుండగా ఈ పడవలు కనిపించాయి. తీర ప్రాంతం గుండా పాక్ ఉగ్రవాదులు ఈ పడవల్లో వచ్చి ఉండవచ్చని అనుమానిస్తున్న బలగాలు వెంటనే అప్రమత్తమై, పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఇంతవరకూ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించ లేదు. ప్రస్తుతం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా, పాక్ ఉగ్రవాదులు తీర ప్రాంతం గుండా భారత్‌లోకి చొరబడవచ్చని ఇంటెలిజెన్స్ సమాచారం ఉంది.

## వరల్డ్ బాక్సింగ్.. మేరీకోమ్‌కు కాంస్యం



హైదరాబాద్: బాక్సింగ్ క్వీన్ మేరీకోమ్.. ప్రపంచ మహిళల చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నది. శనివారం జరిగిన సెమీస్ బౌట్‌లో మేరీ ఓటమి పాలైంది. రష్యాలోని ఉలన్‌లో ఈ ఈవెంట్ జరిగింది. టర్కీకి చెందిన బుసనేజ్ కాకిరోగ్లు చేతిలో మేరీ 4-1 తేడాతో పరాజయం చవిచూసింది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మేరీకోమ్ తొలిసారి 51 కిలోల కేటగిరీలో పోటీపడింది. అయితే వరల్డ్ మహిళల బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో 8 పతకాలు సొంతం చేసుకున్న బాక్సర్‌గా మేరీ రికార్డు క్రియేట్ చేసింది. రెండవ సీడ్, యురోపియన్ చాంపియన్ గోల్డ్ మెడలిస్ట్ అయిన బుసనేజ్ దూకుడు ప్రదర్శించింది. దీంతో మేరీ ఈ టోర్నీలో కేవలం బ్రాంజ్ మెడల్‌కు పరిమితం కావాల్సి వచ్చింది. స్వర్ణ పతకం గెలిచే అవకాశం మిస్సయినా.. మూడవ సీడ్ మేరీ మాత్రం ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఇప్పటి వరకు వరల్డ్ బాక్సింగ్ ఈవెంట్‌లో .. పురుషులైనా.. మహిళలైనా .. 8 పతకాలు ఎవరూ గెలవలేదు. సెమీస్‌లో రెఫరీ తీర్పుపై భారత్ అపీల్ చేసుకున్నది. వరల్డ్ ఈవెంట్‌లో ఇప్పటివరకు ఆరు స్వర్ణాలు, ఓ రజతం, ఓ కాంస్యం మేరీ గెలుచుకున్నది.

## సఫారీలు ఆలౌట్.. భారీ ఆధిక్యంలో భారత్



పుణె: మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియం వేదికగా భారత్‌తో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా జట్టు ఆలౌట్ అయింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ విరాట్ ద్విశతకం, మయాంక్ సెంచరీ, పుజారా, జడేజా, రహానేలు అర్ధ శతకాలు చేయడంతో 156.3 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి.. 601 పరుగులు చేసింది. ఆ తర్వాత మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన సఫారీలకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. భారత బౌలర్లు రాణించడంతో 53 పరుగుల వద్దే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లోపడింది. ఈ దశలో డుప్లెసిస్(64), డికాక్(31) కుదుటపడేందుకు ప్రయత్నించిన.. ఫలితం మాత్రం భారత్‌కు అనుకూలించింది. 162 పరుగుల వద్ద ఎనిమిది వికెట్లు కోల్పోయిన సఫారీలకు కేశవ్ మహారాజ్(72), వెర్నాన్ ఫిలాండర్(44)ల జోడీ అండగా నిలిచింది. వీరిద్దరు కలిసి 9వ వికెట్‌కి 109 పరుగులు జోడించారు. అయితే అశ్విన్ వేసిన 102వ ఓవర్ నాలుగో బంతికి మహారాజ్.. రోహిత్‌కి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత కొంత సమయానికే రబాడా ఎల్‌బీడబ్ల్యూ రూపంలో పెవిలయన్ చేరాడు. దీంతో సౌతాఫ్రికా 105.4 ఓవర్లలో 275 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఫలితంగా భారత్‌కు 326 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. సౌతాఫ్రికాపై తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు లభించిన రెండో అత్యధిక ఆధిక్యం ఇది కావడం మరో విశేషం. కాగా, ఆట కొనసాగే అవకాశం లేకపోవడంతో.. అంపైర్లు మ్యాచ్‌ని వాయిదా వేశారు.

## దేవీ ఆరాధన.. సువర్ణ సాధనా సోపానము

- అన్ని దానములకన్నా అన్నదానమే మిన్న
- యువత దేవీ ఆరాధనలో పాల్గొని తరించాలి
- వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ వ్యాపారవేత్త ఆధ్యాత్మిక వేత్త, చొక్కాకుల వెంకటరావు





విశాఖపట్నం : శ్రీ శ్రీ శ్రీ దుర్గా దేవి నవరాత్రులలో బాగంగా అక్కయ్యపాలెం జాతీయ రహదారి ప్రక్కన నర్సింహా నగర్ రైతు బజార్ రోడ్ లో శ్రీ దుర్గాభవానీ యువజన సంఘం అధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా విచ్చేసిన వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ వ్యాపారవేత్త ఆధ్యాత్మిక వేత్త, చొక్కాకుల వెంకటరావు, లక్ష్మీ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి భక్తులకు అన్నసమారాధన ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ భారతీయ సనాతన సాంప్రదాయానికి శ్రీరామ నవరాత్రులు, గణపతి నవరాత్రులు, దసరా నవరాత్రి మహోత్సవాలు పట్టుకొమ్మలు. దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు రక్తబీజులను రాక్షసులను చండాడి లోకరక్షణ గావించిన మాత దుర్గామాత. గావున అటువంటి మాతను పూజించి తరించడం మానవ జన్మకు సుకృతమని చొక్కాకుల వెంకట రావు అన్నారు. మనము చేసే సాధన, సేవ ఈ శరన్నవరాత్రి కాలములో అధిక ఫలమును ఇచ్చుననుటలో సందేహము లేదు. నేటి యువత ఆధునిక పోకడలతో విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ.. దైవారాధనను కొంత మరచిపోతున్నారు. దేవికి జరిగే పూజలలో భక్తులందరూ పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదములు స్వీకరించి తల్లి కృపకు పాత్రులు కాగలరని కోరారు. అన్ని దానములకన్న అన్నదానము మిన్న అను ఆర్యోక్తి ననుసరించి దుర్గామాత ఉత్సవాలలో అధికంగా అన్నదానం చేయడం జరుగుతోందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వారిలో విశాఖ రూరల్, సబ్బవరం మండలం అంతకాపల్లి మాజీ సర్పంచ్ చొక్కాకుల గోవింద్ సతీమణి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు హరి ,అర్జున్, సతీష్ , శ్యామ్ ,గోవింద్ మరియు చొక్కాకుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ చొక్కాకుల రామకృష్ణ, తర్రా సతీష్, దాసరి నాయుడు, భూషణ్ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## పైడితల్లి అమ్మవారి పండగ ప్రారంభోత్సవాలు



విజయనగరం: విజయనగరం జిల్లా ఘన చరిత్రను, సంస్కృతి సంప్రదాయలను చాటి చెప్పేలా ప్రతి యేటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న విజయనగరం ఉత్సవాలు ఈ ఏడాది ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభోత్సవం లో భాగంగా పైడితల్లి ఆలయం నుంచి ఆనంద గజపతి కళాక్షేత్రం వరకు కళారూపాల ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. కళారూపాల ప్రదర్శన ర్యాలీని ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి, పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఉత్సవాల ప్రారంభోత్సవానికి సూచికగా అమ్మవారి ఆలయం నుంచి కోట మీదుగా ఆనంద గజపతి కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కత్తిసాము, కర్రసాము, కోలాటం, థింసా నృత్యం, చెక్కభజన, పులివేషాలు, గ్రామీణ కళల వైభవాన్ని చాటాయి.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com